18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శనివారం | 30 నవంబర్ 2024 | పేజీలు 11

## జిల్లా పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి తిరుగు పయణం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నారావారి పల్లెలో సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మ క్రియల ప్రక్రియలు పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం 11.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణం అయిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాదర వీడ్కోలు లభించింది. డిఐజి షిమోషి బాజ్ పేయ్, జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, జెసి శుభం బన్సల్, ఎంఎల్‌ఏలు చంద్రగిరి పులివర్తి నాని, శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు కోనేటి ఆది మూలం, నగరి భాను ప్రకాష్, సూళ్లూరుపేట నెల వల విజయశ్రీ, పూతలపట్టు మురళి, ఎంఎల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర వర్మ, తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు పలికారు.





## పశువైద్యశాలలో కనపడని
# సమాచారహక్కు చట్టం బోర్డు



**అధికారుల పేర్లు వారి వివరాలు, ఫిర్యాదు నెంబర్లు వివరాలు ఎక్కడ?**
**తనిఖీలు చేసే అధికారులకు ఇవి కనపడవా...?**
**పట్టించుకోని సంబంధిత అధికారులు**

**తడ, మేజర్‌న్యూస్:** అధికార యంత్రాంగంలో ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా జవాబుదారీతనంగా ఉండటానికి ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం కనుమరుగవుతుంది. ప్రజాస్వామ్యంలో పరిపాలన సవ్యంగా సాగాలన్న అవినీతిని అరికట్టాలన్న ప్రభుత్వాలు వాటి విధి విధానాలు ప్రజలు బహిరంగంగా పూర్తి వివరాలను తెలుసుకోవడానికి ఏర్పాటుచేసిన సమాచార హక్కు బోర్డులోని అధికారులు వివరాలు పట్టికలు ప్రభుత్వ కార్యాలయాల్లో కనపడటం లేదంటూ పలువురు అంటున్నారు. తడ మండలం పశువైద్యశాలలో సమాచార హక్కు చట్టం-2005 పట్టిక బోర్డు ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసింది దర్శనమిస్తుంది. దీంతో పశువైద్యశాలకు వచ్చే పాడి రైతులు అధికారుల వివరాలు తెలియక సతమతమవుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండవలసిన సమాచార హక్కు చట్టం బోర్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఈ సమాచార చట్టంపై ప్రజలకు అవగాహన కూడా కల్పించడంలో విఫలమవుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం-2005

మిగతా 2లో




## శేషాద్రి గ్రీన్‌సిటీలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను
# షిఫ్ట్ చేశారా లేక అమ్మేశారా ?

**కోట, మేజర్‌న్యూస్:** మండలంలోని రోడ్డు పరంబోకి స్థలంలో ఉన్న 100కేవీ ట్రాన్స్ఫారంను శేషాద్రి గ్రీన్ సిటీలోనికి షిఫ్టింగ్ చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాన్స్ఫార్మర్ నుంచి 120 నుంచి 150 హౌస్ విద్యుత్ కనెక్షన్ కలిగి ఉన్నటువంటి ట్రాన్స్ఫారం శేషాద్రి గ్రీన్ సిటీ లేఔట్ లోనికి ఎందుకు మార్చబడినది దీని మీద అనుమానాలు వచ్చిన తర్వాత మీద కొంతమంది పాత్రికేయులు కోట సబ్‌డివిజన్ ఏడిఈ కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ ద్వారా ఎస్టిమేట్ వివరాలను అడుగగా అప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన ఎస్టిమేట్ వేసి ఓనర్ దగ్గర అమౌంట్ కట్టించారు. అసలు గ్రీన్ సిటీ లేఔట్ ఓనర్‌కు ఆత్రుత ఎందుకు చూపిస్తున్నారు. షిఫ్టింగ్‌లో ఉన్నటువంటి వెనుక రహస్యం ఏమిటి అదే విధంగా విద్యుత్ శాఖ అధికారులకు శేషాద్రి గ్రీన్ సిటీ లేఔట్ దగ్గర నుంచి ఎంత మొత్తం ముట్టిందని పలువురు వాపోతున్నారు.



**అన్నం లేక అల్లాడిన విద్యార్థులు...**
## రసంతో కడుపు నింపుకున్న వైనం

వివరాలు 8లో

## ఊరించి... ఉసూరుమనిపించిన ఫెంగల్!

**నిండని చెరువులు... నిరాశలో రైతాంగం**

**గూడూరు, మేజర్‌న్యూస్:** అన్నదాతలను వారం రోజులుగా ఊరించి.. ఊరించిన అల్పపీడనం ఉసూరుమనిపించడంతో నిరాశలో మునిగిపోయారు. బంగాశాఖాతంలో వారం రోజులు క్రితం నుంచి అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు పడతాయని వాతా వరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు చేస్తూ వస్తోంది. తుఫాన్ ప్రభావంతో భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని మందస్తు హెచ్చరికలు చేయడం ఆనవాయతీ. అయితే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆ శాక నుంచి మరి కొంచెం ఎక్కువ అంచనాలు రావడంతో అన్నదాతల్లో ఒక పక్క ఆందోళన మరోపక్క పంటలకు సాగునీరు అందుతుందన్న ధీమా కలిగింది. అయితే వారం రోజులుగా వాతావరణ శాఖ అంచనాలు తలకిందులు చేస్తూ ఫెంగల్ నామకరణం చేసిన తుఫాన్ శ్రీలంక, తమిళనాడుపై భాగంవైపు కదలి వెళ్లడంతో ఈ ప్రాంతంపై తుఫాన్ ప్రభావం కనిపించక పోవడం విశేషం. చిరు జల్లులు తప్ప భారీ వర్షం లేక పోగా వారం రోజులుగా తుఫాన్ ప్రభావంతో మబ్బులతో వాతా వరణం చల్లగాలులు తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు జంతుజాలం చలి ప్రభావానికి గురై ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు సైతం తుఫాన్ కారణంగా ఏర్పడిన



మిగతా 2లో

## నీ స్వార్థ రాజకీయం కోసం చంద్రగిరి ప్రజల్ని వాడుకోవద్దు

**చెవిరెడ్డికి హితవు పలికిన ఎమ్మెల్యే పులివర్తి నాని**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆయన రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసం చంద్రగిరి ఓటర్లను వాడుకోవడం మంచిది కాదని..చంద్రగిరి శాసనసభ్యుడు పులివర్తి నాని హితవు పలికారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులతో కలిసి నాని మాట్లాడుతూ ఎర్రావారిపల్లి మండలం, ఎలమంద గ్రామంలో జరిగిన మైనర్ బాలికకు సంబంధించిన ఫోక్సోకేసు సంఘటనను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోషల్ మీడియాలో ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేసుకోవడాన్ని తప్పుపడుతూ ప్రశ్నించారు. న్యాయ శాస్త్రాన్ని చదివిన అడ్వకేట్ చెవిరెడ్డి..ఓ మైనర్ బాలిక కుటుంబ విషయాలను బహిర్గతం చేయడం ఎంతవరకు సబబన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలన నుంచి చెవిరెడ్డి గ్లోబల్ ప్రచారం చేసుకోవడం చెవిరెడ్డికి పరిపాటిగా మారిందన్నారు. 2012లో వచ్చిన ఫోక్సో చట్టంలోని ఆంతర్యాలు తెలిసి కూడా చెవిరెడ్డి వ్యవహరించిన తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు.



## ఊరించి...ఊరించి ఉసూరుమనిపించిన ఫెంగల్!

(మొదటిపేజీ తరువాయి)

మంగు (తేమ) ప్రభావంతో వేసిన పంటలు తెగుళ్లతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయితే అన్నదాతల్లో తుఫాన్ కల్లోలం లేక పోగా సాగు నీటి కోసం అగచాట్లు పడాల్సి వస్తుం దని ఆవేదన చెందుతున్నారు. రబీ సీజన్ ప్రారంభమై వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తున్నా ఈ ప్రాంతంలోని సాగు నీటి వనరులు సగం కూడ నిండక పోవడంతో ఆందోళన నెలకొంది. ఫెంగల్ తుఫాన్‌పై గంపెడు ఆశలు పెట్టుకున్న అన్నదాతలు పంటల రక్షణకు ప్రభుత్వంపైనే ఆదారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ ప్రాంతానికి వరప్రసాదమైన తెలుగుగంగ నీటిని చెరువులకు తీసుకు రావల్సిందేనని పేర్కొంటున్నారు. ఇక ముందు కూడ భారీ వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంటుందని మరో అల్పపీఢనం ఏర్పడితే తప్ప వర్షాలు కురిసే అవకాశం తక్కువేనని పేర్కొంటున్నారు. ఈ నేపధ్యంలో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తూ భవిష్యత్ అంచనాల్లో తలమునకలైయ్యారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన అడిషనల్ డెరైక్టర్

**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** కేజీబీవీని అడిషనల్ డెరైక్టర్ సి.దేవరాజులు, జీసీడీఓ ఇంద్రాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూ ప్రకారంగా అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఓ సుజాతను కోరారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యత



విషయంలో రాజీ పదరాదని అన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, రిజిస్టర్ ప్రకారంగా స్టోర్ రూంలో స్టాక్ వుందా లేదా అని పరిశీలించారు. భోజనాన్ని విద్యార్థులతో పాటు కూర్చొని తిని రుచి చూశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖా అధికారులు ఇందిరా, శ్రీనివాసులు, సీఆర్పీలు,కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలో డ్రగ్స్ వినియోగం అవాస్తవం : రిజిస్ట్రార్

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డ్రగ్స్ వినియోగిస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తమని, డ్రగ్స్ సంబంధించిన ఆనవాళ్లు ఫిజికల్, లేబొరేటరీ నివేదికలలో లేవని ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జె.రమాశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీనిపై విశ్వవిద్యాలయం యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటుచేసి ఈ సంఘటనలో ఆరోపణలు వచ్చిన ఇద్దరు విద్యార్థులను రుయా ఆసుపత్రి వైద్య పరీక్షలకు గతంలో ప్రకటన ద్వారా తెలియజేశామన్నారు. ఆరోపణలు వచ్చిన ఇద్దరు విద్యార్థులను లేబరేటరీ ప్రయోగశాల ద్వారా పరీక్షలు చేసి ఎటువంటి డ్రగ్ వినియోగం చేయలేదని వైద్యులు నివేదికలో నిర్ధారించారన్నారు.



జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం పరిపాలన ఆర్డినేట్ ప్రకారం ఈ సమస్యను విద్యార్థులకు క్రమశిక్షణ కమిటీ ముందు ఉంచారు. విశ్వవిద్యాలయ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించి వారిని సన్మార్గంలో ముందుకు నడిపించాలని కమిటీ అభిప్రాయపడింది. విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థు లకు డ్రగ్స్ వల్లే వచ్చే అనర్థాలను ప్రమాదాలకు సంబంధించి సాధారణ కౌన్సెలింగ్ సెషన్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.

## పరమశివునికి అన్నాభిషేకం

### భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

**సూళ్లూరుపేట రూరల్, మేజర్‌న్యూస్:** సూళ్లూరుపేటలో వెలసివున్న గంగా పార్వతి సామెత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భముగా శుక్రవారం పరమేశ్వరునికి అన్నాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ కుమార్ శర్మ అద్వర్యంలో ఆలయ మాజీ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి సహాయక సహకారాలతో జరిగిన అన్నాభిషేకం మహోత్సవమును పెద్ద సంఖ్యలో భక్తులు కనులారా వీక్షించి తరించారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేకం చేసిన అన్నంతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అలంకారం చేసిన అన్నంతో భక్తులకు అన్నప్రసాదాలుగా పంచి పెట్టారు. ఉభయ దాతలు కర్లపూడి రమేష్ దంపతుల సహకారంతో జరిగిన ఈ వేడుక అనంతరం ఆలయం వద్ద వృద్ధులకు మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం రెడ్డి చేతులు మీదుగా దుప్పట్లు పంపిణి చేశారు. ఈ వేడుకలో మాజీ బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

## మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేద్దాం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ డిసెంబర్ 7వ తేదీన ఊరందూరు ఉన్నత పాఠశాల ఆవరణంలో ఒక పండుగ వాతావరణంలో నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊరందూరు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసి డిసెంబర్ 7వ తేదీన భారీ ఎత్తున జరుప తలపెట్టిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానించారు. గ్రామంలో ఇతర పెద్దలను విద్యా వేత్తలను తల్లిదండ్రులను కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీంద్ర బాబు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జాతీయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్, మల్లికార్జున, మురళి, రమేష్ బాబు మొదలగు వారు పాల్గొన్నారు.



## పశు వైద్యశాలలో కనపడని సమాచార హక్కు చట్టం బోర్డు

(మొదటిపేజీ తరువాయి)

బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ బోర్డులో పౌర సమాచార అధికారి, పౌర సమాచార సహాయ అధికారి, అప్పీలు స్వీకరించే అధికారుల పేర్లు, హెూదా చిరునామా ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేయాలి అనంతరం ఎవరైనా ప్రభుత్వ కార్యాలయంలో జరిగే పనులు తదితర సమస్యలపై వివరాలు అడిగితే నిబంధనల ప్రకారం సామాన్యుడికి ఇవ్వాలి కానీ తడ మండలంలోని పశు వైద్యశాల కార్యాలయంలో అధికారులు వారి పేర్లు, హెూదాలు, మొబైల్ నెంబరు తదితర వివరాల సమాచారం ఎక్కడా లేకపోవడంతో ప్రజలు సమస్యలను ఎవరికి తెలియచేయాలో తెలియక అస్తవ్యస్తలు పడుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు పశు వైద్యశాల



కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని తడ మండల ప్రజలు కోరుతున్నారు.

## బేస్‌బాల్ పోటీల్లో బిసీఎం స్కూల్ విద్యార్థికి పసిడి పతకం

**తిరుపతి ప్రెస్ క్లబ్, మేజర్‌న్యూస్:** ఈనెల 24 నుంచి 26 వరకు స్థానిక మంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ (మంగళం ట్రెండ్స్) నందు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ బేస్ బాల్ అండర్-14 పోటీల్లో బాలచంద్ర మెమోరియల్ స్కూల్ (బిసిఎం)లో 8వ తరగతి చదువుతున్న బి.మహేష్ అనే విద్యార్థి పసిడి పథకం సాధించడం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాల నందు అభినందన సభ ఏర్పాటు చేసి పథకం సాధించిన విద్యార్థి మహేష్‌కు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియ చేసారు. పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తి నాయుడు విద్యార్థి



మహేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదేవిధంగా అనేక పోటీలలో పాల్గొని మరెన్నో విజయాలను సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ప్రియ మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉల్లాసాన్ని అదేవిధంగా శారీరక దృఢత్వాన్ని పెంపొందింప చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ సుకన్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీన, ఉపాధ్యాయులు మహేష్‌కు అభినందనలు తెలియజేశారు.

## గంజాయి కేసులో పరారిలో ఉన్న వ్యక్తి అరెస్ట్

### రెండవ పట్టణ సీఐ నెట్టి కంటయ్య

**చిత్తూరు క్రైం, మేజర్‌న్యూస్:** గంజాయి కేసులో పరారిలో వున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని రెండవ పట్టణ సిఐ నెట్టికంటయ్య తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐ మాట్లాడుతూ చిత్తూరు పట్టణంలో యువతకు అక్రమంగా గంజాయి



విక్రయించి, వారిని చెడు వ్యసనాలకు బానిసలుగా చేస్తున్న వ్యక్తులపై, గంజాయి అమ్మకం రవాణా చేస్తున్న వ్యక్తులపై ఉక్కుపాదం మోపి పూర్తిగా అరికట్టుటకు, వారిపై నిఘా ఉంచి, వారిని పట్టుకొనుటకుగాను చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంట చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో రెండవ పట్టణ సి నెట్టి కంటయ్య ఎస్ఐ ప్రసాద్ సిబ్బంది కలిసి చిత్తూరు పట్టణం లోని ఇరువారం ఏరియాలో 12 వ తేదిన రవితేజను అరెస్టు చేసి, రెండు కేజిల గంజాయిని స్వాధీనం చేసుకొని, రిమాండుకు పంపామని, ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతి బెంగులూరు బైపాస్ రోడ్డులో అరెస్టు చేశామని, పట్టుబడిన ఆర్.శరవణ చెప్పిన వివరాల మేరకు శరవణ అతనికి తెలిసిన వెంకటేష్ అలియాస్ కుట్టి అను అతని వద్ద నుండి రూ.15వేలు విలువగల ఒక కేజీ గంజాయి రూలుకు తీసుకొని, దానిని నేను చిన్న, చిన్న పొట్లాలుగా కట్టి ఎక్కువ ధరలకు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తూ వుండేవాడని, అదేవిధంగా అతనికి పరిచయం వున్న రవితేజకు కూడా వెంకటేష్ అలియాస్ కుట్టి వద్ద గంజాయి తీసి ఇచ్చి, చిత్తూరు టౌన్‌లో గంజాయి ఉపయోగించే వారికి, కాలేజీల దగ్గర స్టూడెంట్స్‌కు అమ్ముకొని వచ్చిన లాభం ఇద్దరూ పంచుకునే వారని తెలపడం జరిగిందని, అరెస్టు కాబడిని శరవణను కోర్ట్ ఎదుట హాజరు పరుస్తామని, పరారీలో ఉన్న వెంకటేష్ అలియాస్ కుట్టిని త్వరలో అరెస్టు చేస్తామని సిఐ నెట్టి కంటయ్య తెలిపారు. నిందితున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన రెండవ పట్టణ సిఐ నెట్టి కంటయ్యను, ఎస్ఐ ప్రసాద్‌ను డీఎస్పీ సాయినాథ్ అభినందించారన్నారు.

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** విద్యార్థులు విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రముఖ వైద్యులు దుర్గాప్రసాద్, ప్రభుత్వ సీనియర్ అడ్వకేట్ చంద్రశేఖర్, ప్రముఖ ఆడిటర్ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని శ్రీకాంత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నాయకత్వ లక్షణాల పైన విద్యార్థులకు ఏపీ ఉమెన్స్ ట్రైవ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కనాలి వాటిని సాకారం చేసుకోవాలన్నారు. దీనికిగాను విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. దృఢ సంకల్పం, నేర్చుకోవాలనే తపన, నేర్చుకున్నది అమలు చేయాలని సంకల్పం ఉండాలన్నారు. నూతన విషయాలను అన్వేషించాలని, ఈ నేపథ్యంలో పెద్దలను గురువులను గౌరవిస్తూ వారి మాటలను అమలులో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు రషీదా, ప్రభు జ్యోతి పాఠశాల కరస్పాండెంట్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

**డక్కిలి, మేజర్‌న్యూస్:** విద్యార్థులు ప్రతిభావంతులుగా మారాలంటే ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదిన ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో



విద్యార్థుల పట్ల తల్లిదుండ్రులు తమ బాధ్యతను గుర్తు చేసే విదంగా ఈ సమావేశాలు నిర్వహణ ఉండాలన్నారు. పిల్లలను ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సమావేశం అనంతరం విద్యార్థి ప్రతిభను వివరించడం తోపాటు, మధ్యహ్నం భోజనం పథకం, విద్యార్థి యొక్క ప్రతిభను తల్లిదండులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండివో గుణశేఖర్ రెడ్డి, ఎఈవో జగదీష్ బాబు ఉన్నారు.

## పద్మావతి అమ్మవారికి డీకే చైతన్య పట్టు వస్త్రాలు సమర్పణ

**పలమనేరు, మేజర్‌న్యూస్:** తిరుపతి సమీపంలో ఉన్న తిరుచానూరు బ్రహ్మోత్సవాలలో



భాగంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలను చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ చైతన్య ఆది కేశవులు అమ్మవారికి పట్టు వస్త్రాలను శుక్రవారం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత ఎనిమిది రోజులుగా అమ్మవారికి ఒక్కరోజు ఒక్కో పట్టుచీర ఆమె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పగడాల ప్రవీణ్ పాల్గొన్నారు.

## కపిలేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా ముగిసిన రుద్రయాగం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో 11 రోజుల పాటు జరిగిన శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రయాగం) శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిసింది. ఆలయంలో హోమ మహోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉదయం రుద్రయాగం సమాప్తి, మహాపూర్ణాహుతి, మహాశాంతి అభిషేకం, కలశ ఉద్వాసన, కపిలేశ్వరస్వామి మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అంతరం రాత్రి కాలభైరవ స్వామివారి కలశ స్థాపన, కలశ ఆరాధన నిర్వహించారు. నవంబరు 30న కాలభైరవస్వామివారి హోమం జరగనుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ జెఈవో గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్జీడీ కవిత్వం ప్రకృతి సౌందర్యమే

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రకృతి సౌందర్యాన్ని తెలుగు విశ్రాంతచార్యులు ఎస్జీడీ చంద్రశేఖర్ కవిత్వంగా మలిచారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు అధ్యయన శాఖలోని విభాగాతిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన సమావేశ మందిరంలో ఆచార్య ఎస్జీడీ చంద్రశేఖర్ రాసిన సూక్ష్మ



కవితలు-2 ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్ తెలుగు విభాగంలో పీజీ, పీహెచ్‌డీ చేసి, అధ్యాపకులుగా చేరి ఆచార్యులుగా పదోన్నతి పొంది, వర్సిటీ ప్రిన్సిపల్‌గా వివిధ పాత్రలలో నాలుగు దశాబ్దాలకు తెలుగు అధ్యయన శాఖకు కృషి చేశారని కొనియాడారు. కవిగా హేమంత వసంతిక, ఎస్జీడీలు, సూక్ష్మ కవిత-1, సూక్ష్మ కవితలు -2 పుస్తకాలు రచించారని, సాహిత్య సృజనలో విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఆమె కోరారు. ఆచార్యపేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మనుషులతో సున్నితంగా వ్యవహరించే ఎస్జీడీ చంద్రశేఖర్ కవిత్వం కూడా అత్యంత సున్నితంగా సృజించారని అభిప్రాయపడ్డారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిలక్, శ్రీశ్రీ ప్రభావంతో ఎస్జీడీ చంద్రశేఖర్ గొప్ప కవిత్వాన్ని రాశారని చెప్పారు. తాను కవిత్వం రాయడమే కాక కొత్త తరం కవులను ప్రోత్సహిస్తూ ఉన్నారన్నారు. పుస్తక సమీక్ష చేసిన ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రకృతిని, ప్రణయ తత్వాన్ని గొప్ప కవిత్వంగా రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్రాంతాచార్యులు మునిరత్నమ్మ, కాటూరి శారద, కె.మునిరత్నం, ఎలవర్తి చంద్రమౌళి, సాహిత్య వేత్తలు ఆర్‌సి.కృష్ణ స్వామిరాజు, ఎస్‌హెచ్ సౌభాగ్యమ్మ, ఆకుల మల్లేశ్వరరావు, సింగార బాలమురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునిక మార్పులకు అనుగుణంగా బోధన

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** ఆధునిక మార్పులకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు అన్నారు. శుక్రవారం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల జెన్‌టియు, సంయుక్తంగా నిర్వహించిన డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరాత




విద్యార్థుల ఉన్నారు. ప్రతి విషయాన్ని క్షుణంగా అర్థవంతంగా బోధించాలన్నారు. అనంతరం ప్రోగ్రాంలో పాల్గొన్న ఈ అధ్యాపకులకు ధ్రుపత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మయ్య వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ శరవణ కుమార్, కంట్రోలర్ ఆఫ్ పరీక్షల డైరెక్టర్ సతీష్ కుమార్, ప్రోగ్రాం ఆర్డినేటర్ జ్యోతి బసిని, వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ : కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్‌లు డిసెంబర్ నెలలో పంపిణీ చేయాల్సినవి సచివాలయ సిబ్బంది ద్వారా నేడు జిల్లాలో 2,64,636 మంది లబ్దిదారులకు సుమారు రూ.112.25కోట్లు పంపిణీ లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి చేయనున్నట్లు తెలుపుతూ పెన్షన్ల పంపిణీ ఉదయం 6గంటల నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆలస్యమైతే తప్పకుండా చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 1న ఆదివారం సెలవు దినం ఉన్నందున ముఖ్యమంత్రి సదరు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒక రోజు ముందుగానే సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ లబ్ధిదారులకు ఈ నెల 30నే పంపిణీ చేయాలని ఆదే శించిన నేపథ్యంలో ఉదయం 6గంటలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా ఉపేక్షించేది లేదని, వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. ఏదేని కారణంగా మిగిలిపోయిన వారికి డిసెంబర్ 2వ తేదీన మాత్రమే పంపిణి చేయాలని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు అందరూ ఈనెల 30న పెన్షన్ తీసుకోనవలెనని, బయట గ్రామాలకు వెళ్ళిన వారు కూడా వారి గ్రామాలలో అందుబాటులో వుండి పెన్షన్ తీసుకోవాలని సంబంధిత మండల, సచివాలయ అధికారులు వారికి సమాచారం అందించి అందరూ అందుబాటులో ఉండేలా వారికి సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెన్షన్ లబ్దిదారులు ఎవ్వరు సచివాలయ కార్యాలయానికి రావలసిన అవసరం లేదని తిరుపతి జిల్లా కలెక్టర్ వారు తెలిపారు. సంబంధిత ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు సదరు పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## అభివృద్ధి పనులపై ఆలస్యం తగదు

### పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే

**పలమనేరు, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలోని గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన అభివృద్ధి పనులపై అలసత్వం తగదని మున్సిపల్ అధికారులకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలోని అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన ఎప్పటికప్పుడు సమీక్షలునిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు టౌన్‌హాల్ ఏర్పాటు అదే విధంగా మురుగు నీటి శుద్ధికి సంబందించిన ప్లాంట్ నిర్మాణం తదితర అంశాలపై అధికారుల నుంచి సమాచారం సేకరించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు ఏమాత్రం అందు



బాటులో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఇంకా ఎంత మేర నిధుల తెచ్చుకొనే అవసరం ఉంది అని చర్చించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏదైనా ఉన్నా త్వరితగతిన పూర్తి చేసి పనుల పురోగతికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్షలో ఏ.ఈ స్నేహలత, టౌన్ ప్లానింగ్ అధికారిణి ఇందిరా సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయాలు..పూర్వ వైభవం సంతరించుకోవాలి

### గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ లక్ష్యమిదే

### వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రకాష్ రావు స్పష్టీకరణ

**తిరుపతిప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** హైందవ జాతి ఆత్మ అయినటువంటి



దేవాలయాలు..పూర్వవైభవం సంతరించుకోవాలన్నదే గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ (జిహెచ్ హెచ్‌ఎఫ్) ఏక సూత్ర లక్ష్యం,ధ్యేయం అని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలగపూడి ప్రకాష్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేందుకు వార్షిక ఆడిట్ నివేదికను అందించాలన్నారు. టీటీడీ అలాగే ఇతర దేవాలయ అధికారులు పారదర్శకత బాధ్యతాత్మకత మరియు ఆధ్యాత్మిక సమగ్రత కోసం పనిచేయాలన్నారు. అలాగే తిరుచానూరు తిరుపతి తిరుమల ఈమూడిటిని ఒక కారిడార్ లాగా చేయాలన్నారు. తిరుపతిలో కానీ తిరుచానూరులో కానీ ఎక్కడా మద్యం షాపులు, మాంసం దుకాణాలు ఉండకుండా చూడాలన్నారు. ఆ వ్యాపారులకు టిటిడి దేవస్థానమే నష్టపరిహారం అందించి వారిని ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలన్నారు. అప్పుడే ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన భక్తి భావం కలుగుతుందని సలహా ఇచ్చారు. టీటీడీకి వచ్చే ప్రతి రూపాయి భక్తుల సౌకర్యం కోసమే వినియోగించాలని, వారి యాత్రను ఆధ్యాత్మికంగా ఆనందంగా మార్చే చర్యలు చేపట్టాలన్నారు.అంతేతప్ప టిటిడి నిధులను అన్యధార్మిక ప్రయోజనాల కోసం వినియోగించకూడదని స్పష్టం చేశారు. టీటీడీలో పనిచేసే ఉద్యోగులు కేవలం హిందువులుగా మాత్రమే ఉండాలని, అన్యమతస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని తేల్చి చెప్పారు. అలాగే టిటిడి విద్యాసంస్థల్లో కానీ, వైద్యశాలల్లో కానీ హిందువులు మాత్రమే ఉద్యోగులుగా ఉండాలన్నారు.తిరుపతిలో అక్రమంగా నిర్మించిన చర్చిలు,మసీదుల సంఖ్యను గుర్తించేందుకు టీటీడీ చర్యలు తీసుకోవాలని కోరారు.ఏడుకొండల పాదాల చెంత అలిపిరి సమీపంలో ఎక్కడా పాశ్చాత్య సంస్కృతి కలిగిన రెస్టారెంట్లు నిర్మించడానికి వీలులేదని, రాష్ట్ర ప్రభుత్వం సనాతన ధర్మ రక్షణ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి హెచ్ హెచ్‌ఎఫ్ కన్వీనర్ వేణుగోపాల్ రావు,బిజెపి నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్య యాదవ్, రమాదేవి, కిరణ్, విజయలక్ష్మి, పసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి కూటమితో కలసి నడుస్తాం

**గూడూరు, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి పరిచేందుకు కూటమి పార్టీల సహకారంతో ముందుకు వెళతామని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తీగల చంద్ర పేర్కొన్నారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, పార్టీ నాయకులు మధులత, కీర్తన, రాజారెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ని కలసిన గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ పిఓసి కె మోహన్ కూటమి ప్రభుత్వం హయాంలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గూడూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మరికొన్ని అభివృద్ధి పనులకు సహాయం చేయాలని దీనిని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఉప్పు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## మొదటి ఘాట్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా ప్రత్యేక అభిషేకం



**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గం చెంత వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి శుక్రవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అడిషనల్ ఈవోను శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నం సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



# సిటీ ఆపరేషన్ సెంటర్ త్వరగా పూర్తి చేయండి

**- స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేసిన మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య**



**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** నగరంలో పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిపై నిర్మాణ సంస్థల ప్రతినిదులు, స్మార్ట్ సిటీ అధికారులతో శుక్రవారం సాయంత్రం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, గరుడ వారధి, మల్టి లెవల్ కార్ పార్కింగ్, స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ ప్రాజెక్టులో జరుగుతున్న పనుల వివరాలను వివరించారు. ఐదు అంతస్తుల్లో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ లో ఏర్పాటు చేయనున్న కార్యాలయాల వివరాలను తెలుసుకున్నారు. ఇందులో కొన్ని మార్పులు, చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ నగరంలో ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ (నగరపాలక సంస్థ కార్యాలయం) పనులను గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవనంలో అధికారుల ఉద్యోగులకు సరిపోయేలా ఫర్నిచర్ తదితరాల సిద్ధం చేయాలని, అందులోనూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. గరుడ వారధిలో పెండింగ్ లో ఉన్న పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. మల్టి లెవల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. చంద్రశేఖర్, డి.ఈ.లు రాజు, మధు, లలిత, స్మార్ట్ సిటీ ఏ.ఓ.రాజశేఖర్, సి.ఎఫ్. ఓ. మల్లికార్జున, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిదులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారికి టీటీడీ మహిళా ఉద్యోగుల సారె



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుచానూరులో జరుగుతున్న శ్రీ పద్మావతి అమ్మవారికి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం టీటీడీ మహిళా ఉద్యోగులు శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ గౌతమి, ఉన్నతాధికారుల సతీమణులతో పాటు టీటీడీ మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## సిఎంకు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే భాను

**నగరి, మేజర్ న్యూస్:** జిల్లా పర్యటన ముగించుకుని అమరావతికు తిరుగు ప్రయాణమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



## జనవాణికి 45 వినతలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణికి 45 వినతులు అందాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రెండు రోజులు పాటు మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ పాల్గొని రాష్ట్రంలో వివిధ



ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతి రూపంలో వారికి అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పరిష్కారం కానీ ప్రజా సమస్యలను ప్రజావాణి ద్వారా పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు ప్రజావాణిలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షులు బాబ్జి, నాయకులు, నైనార్ శ్రీనివాసులు, సునీల్ చక్రవర్, రాజేష్ యాదవ్, పగడాల మురళి, కీర్తన, న్యాయవాదులు గాలి శ్రీనివాసులు, కంచి శ్యామల, భార్గవ్, పోటుకూరు ఆనంద్, భాను, పుట్టా ఆనంద్, ఇర్లా సోమశేఖర్ పాల్గొన్నారు.

# గోవాలో వచ్చే నెల పెళ్లి

**తిరుమలలో సందడి చేసిన కీర్తి సురేష్**



**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ కథానాయకి కీర్తి సురేష్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్ధప్రసాది అందజేశారు. ఆలయం వెలుపల కీర్తి సురేష్ మాట్లాడుతూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కనునట్లు తెలిపారు. గోవాలో వచ్చే నెల తన వివాహం జరగనుందని అన్నారు. వివాహానికి ముందు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చినట్లు తెలిపారు. బేబీ జాన్ అనే హిందీ చిత్రంలో నటిస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర త్రోబాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు మేజర్ న్యూస్ : చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలమునందు రాష్ట్ర త్రో బాల్ పోటీలు బాల బాలికలకు నిర్వహించారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు సంబంధించిన బాలబాలికలు త్రో బాల్ ఆట పోటీలలో పాల్గొన్నారు. అండర్ 14 బాల బాలికల త్రో బాల్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించి, తద్వారా విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఆటల పోటీలు సందర్భంగా చిన్నారి భరతనాట్యం విద్యార్థులను ఆకర్షించింది. భరతనాట్యం చేసిన చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు.





## శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం అభిషేకం సేవలో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి జి.వి. నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లా పరిశ్రమల శాఖ, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ మరియు జిల్లా అధికారితో కలసి ఎంపీడీఓలు మునిసిపల్ కమీషనర్లు గ్రామ, వార్డ్ సచివాలయముల సిబ్బందితో జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి జి.వి. నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వేపై శిక్షణ ఇచ్చారు.సర్వే మొబైల్ యాప్ ద్వారా పరిశ్రమలు, సర్వీస్, వ్యాపార సంస్థల యొక్క వివరాలు నమోదు, విధి విధానాలపై పలు సూచనలు చేసారు సర్వేతో పాటు ప్రతీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలోని వివిధ ఇండస్ట్రియల్, వ్యాపార అసోసియేషన్స్ ను భాగస్వామ్యం చేసి అవగాహనా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే పరిశ్రమ శాఖ అధికారులు ఏపీఐఐసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలోని సిబ్బంది వెంటనే సర్వే మొదలు పెట్టవలసిందిగా తెలియజేసారు.

# ఫిబ్రవరి 1 వ తేదీ వరకు ఎంఎస్ఎంఈల సర్వే

## – చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** ఎంఎస్ఎం ఈ ల పని తీరును మెరుగు పరచడం అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమును ప్రకటించిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమును ప్రకటించిందని, ఈ ర్యాంప్ లోని ఒక అంశమైన .ఈ ల ఫార్మలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేయడం కోసం ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా నవంబర్ 29 న జారీ చేసిందని,ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాలలో అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ఫ్లాట్ ఫామ్‌లోనికి తీసుకు వచ్చిఏపీఎంఎస్ఎంఈ వన్ పోర్టల్ ను అను సంధానించడం,నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ్ అసిస్ట్‌లో నమోదు చేయడంను ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ–సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ఈ–సర్వే కోసం ఎంఎస్ఎంఈ –సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్ ను రూపొందించడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయం సిబ్బంది, పట్టణ ప్రాంతాల్లో పట్టణ సచివాలయం సిబ్బంది ఈ సర్వే ని ఈ నెల 29 వ తేది నుండి ఫిబ్రవరి ఒకటవ తేదీ 2025 వరకు చేస్తారని, ఈ–సర్వే ద్వారా రాష్ట్రం లోని అన్ని ఎంఎస్ఎంఈల డేటా ను సేకరిస్తారని, వివిధ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, మహిళలు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక నైపుణ్యాలను అభివృద్ధి పరచటం మొదలైన సేవలను ఎంఎస్ఎం ఈలకు అవగాహన శిబిరాలను నిర్వహించి ఉద్యం లేదా ఉద్యం అసిస్ట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారని, ఇలా ఉద్యం లేదా ఉద్యం అసిస్ట్ చేయడం ద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులు అవుతారని, బ్యాంకు ఋణ సదుపాయాలు సులభతరం అవుతాయని తెలిపారు. ఎంఎస్ఎంఈల చెల్లింపుల ఆలస్యమును సమాధాన్ పోర్టల్ తో అనుసందానించడం ద్వారా తగ్గించవచ్చని, ఎంఎస్ఎంఈల అసోసియేషన్స్, ఇతర పరిశ్రమల అసోసియేషన్స్, సేవా రంగం, వాణిజ్య రంగాలు సర్వే టీమ్‌కు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# నియోజకవర్గం ప్రజా సమస్యలు పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్లు

## – తొందరలో వైసీపీ నాయకులు అరెస్ట్

## – శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పత్రిక విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గం అన్ని మండలాలు ప్రజలు సమస్యలు పరిష్కరించే దిశగా ప్రతి మండలానికి ఒక టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేస్తామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్లు పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ వారి వారి మండలాల్లో కేటాయించిన టోల్ ఫ్రీ నెంబర్లకు వారి సమస్యలను తెలియజేస్తే వెంటనే వాటి పరిష్కార దిశగా అధికారులు కార్యాచరణ చేపడతారని తెలిపారు. తాను కూడా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కార దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేసే విధంగా కార్యాచరణ చేపడతానని తెలియజేశారు. ఎమ్మార్వో కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యేకి లంచాలు ఇస్తున్నామంటూ వస్తున్న అపవాదాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బొజ్జల కుటుంబం నీతి నిజాయితీగల కుటుంబమని, ఇలాంటి అవాస్తవాలు మరోసారి పునరావతమైతే. ఎమ్మార్వో కార్యాలయలలో తన పేరు చెప్పి ఎవరు అవినీతికి పాల్పడుతున్నారో ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులను హెచ్చరించారు. తను శ్రీకాళహస్తిలో బీసీ ఎస్సీ హాస్టల్ విద్యార్థుల పరిస్థితి చూసి ఆ హాస్టల్ ను మరమ్మత్తులు చేసిన సంగతి బిసి వెల్ఫేర్ మంత్రికి తెలియడంతో రాష్ట్రంలో బీసీ హాస్టల్ అన్ని శ్రీకాళహస్తులు ఏ విధంగా పునరుద్ధరించబడ్డాయో ,అదే విధంగా రాష్ట్రంలోని బీసీ ఎస్సీ ఎస్టీ హాస్టల్లో నూతన హంగులతో రూపుదిద్దుకునేటట్లు 140 కోట్లు బీసీ హాస్టల్ పునర్నిర్మాణానికి మంజూరు చేయడం సంతోషంగా ఉందంటూ బీసీ వెల్ఫేర్ మంత్రి ఆయన ధన్యవాదాలు

# డిసెంబర్ నెల పెన్షన్లు ఒకరోజు ముందుగానే

## – నేడు సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ : కలెక్టర్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** డిసెంబర్ నెల కు సంబందించిన ఎన్ టి అర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు ఒకరోజు ముందు గానే నవంబర్ 30 శనివారం పెన్షన్ల పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1 వ తేదీ ప్రభుత్వ సెలవు కావడంతో నవంబర్ 30 వ తేదీన పెన్షన్‌లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నుండి ఆదేశాలు అందిన నేపద్యంలో నవంబరు 30 న ఉదయం 6 గంటలకు పింఛన్లు పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు డిసెంబర్ మాసంలో 2,67,936 మంది లబ్దిదారులకు సుమారు రూ. 113.31 కోట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. నవంబర్ 30 న సచివాలయ సిబ్బంది లబ్ధిదార్ల ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు అందజేయడం జరుగుతుందని, పెన్షన్ లబ్ధిదారులందరూ ఇంటివద్దనే ఉండి పెన్షన్లు తీసుకోవాలని, సచివాలయ కార్యాలయానికి వెళ్ళవలసిన అవసరం లేదని తెలిపారు. పెన్షన్ల పంపిణీ పకడ్బందీగా జరగాలని, పెన్షన్ల పంపిణీ ని మండల స్థాయిలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# లీడర్షిప్ శిక్షణ పొగ్రాం డీఈఓ తనిఖీ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** వెరిటాస్ సైనిక్ స్కూల్ లో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం రెండవ దశ మూడవ బ్యాచ్ ను జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన స్కూల్ ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో కెవిఎన్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఏ విధంగా బోధన అందించి మిగిలిన విద్యార్థులతో కలిపి అన్నింటిలోనూ రాణించే విధంగా కార్యక్రమాలను రూపొందించాలని తెలియజేశారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులకు వసతి, భోజన సదుపాయాలను గురించి ఆరా తీశారు. ఏదైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా డిసెంబర్ 7న జరిగే మెగా పేరెంట్స్ డే ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఎస్ శివ శంకరయ్య, ఏ ఎస్ ఓ సారధి, కైవల్య ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.



## గ్రామీణ మహిళలకు యోగా శిక్షణ అందించేందుకు

# కేంద్ర ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా?

## – పార్లమెంటులో ప్రశ్నించిన ఎంపీ మద్దిల గురుమూర్తి



**తిరుపతి రెవెన్యూ, మేజర్ న్యూస్:** దేశంలోని గ్రామీణ మహిళలకు యోగా శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా, అలా అయితే రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వగలరు, ఆలా కానీ పక్షంలో అందుకు గల కారణాలుతెలుపగలరు అంటూ తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి నేడు పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాదానంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాదనం ఇస్తూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థల ద్వారా గ్రామీణ మహిళలతో సహా ప్రజలకు యోగా శిక్షణ ఇస్తుందని తెలియజేశారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ తన మూడు స్వయంప్రతిపత్తి సంస్థలైనటువంటి న్యూ ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా,సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, నేచురోపతి, పూణే లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి ద్వారా దేశంలో యోగాను ప్రోత్సహిస్తుంది తెలియజేశారు. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, యోగా విద్య కోసం వివిధ కోర్సులను అందిస్తుందన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అనేది యోగా, నేచురోపతి వ్యవస్థలలో పరిశోధన, అభివృద్ధికి అత్యున్నత సంస్థగా పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి, నేచురోపతి విభాగంలో ఒక ప్రధాన సంస్థ అని ప్రకృతి వైద్యం, యోగాకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తుందని తెలియజేశారు. ఈ మూడు సంస్థల యొక్క కార్యకలాపాలు, ప్రోగ్రామ్‌లు వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అలాగే, యోగాతో సహా దేశంలోని వివిధ ఆయుస్ వ్యవస్థల అభివృద్ధి ప్రమోషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జాతీయ ఆయుష్ మిషన్ యొక్క కేంద్ర ప్రాయోజిత పథకాన్ని మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర వార్షిక ప్రతిపాదనల ప్రకారం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలియజేశారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద, ఆయుష్ మంత్రిత్వ శాఖ రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రభుత్వాల ద్వారా 12,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ యొక్క కార్యాచరణను అమలు చేస్తోందని తెలియజేశారు. ఈ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో, అర్హత కలిగిన యోగా శిక్షకుల ద్వారా సాధారణ ఆరోగ్య ప్రమోషన్ లో భాగంగా గ్రామీణ మహిళలతో సహా ప్రజలకు యోగా బోధించబడుతోందని ఈ ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.

# స్వర్ణముఖి నది సుందరీకరణ కు ప్రత్యేక ప్రణాళికలు

## – ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి దేవస్థానం పరిసర ప్రాంతాలలో స్నాన ఘట్టాలు. స్వర్ణముఖి నది హారతులు ఏర్పాట్లను శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో బాపిరెడ్డితో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి నెలలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి పూర్తి కార్యాచరణ చేపడుతున్నామని తెలియజేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్నాన ఘట్టాలను పరిసర ప్రాంతాలను పరిశీలించామని స్వర్ణముఖి నది ప్రక్షాళన కావించి స్వర్ణముఖి నదికి ఇరు వైపుల కరకట్టను సుంద్రీకరణంగా తీర్చిదిద్ది మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో మహాశివరాత్రి తిలకించే విధంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నామన్నారు. సుందరి కరంగా తీర్చిదిద్దిన కరకట్టను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌చే ప్రారంభించే విధంగా కార్చరణ చేపడుతున్నామని తెలియజేశారు. ఈనెల 30వ తేదీన నిర్వహించే హారతులను అత్యంత వైభవంగా నిర్వహించే విధంగా నదిహారతులు సామాన్య భక్తులు తిలకించే విధంగా కార్యాచరణ చేపడుతున్నామని. గత ప్రభుత్వంలో రాజకీయ నాయకులకే నది హారతులు పరిమితమయ్యాయని. ఈ పర్యాయం సామాన్య ప్రజలకు నదిహారతులు వీక్షించే విధంగా ఈ పర్యాయం నది హారతులు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో నిర్వహిం చే రాహు కేతు పూజలు సంబంధించిన టికెట్లు ఇచ్చే కౌంటర్లను ఆలయం వెలుపల సౌకర్యార్థం రంగుల గోపురం వద్ద ఏర్పాటు చేస్తామని. రాహుకేతు పూజలు నిర్వహించు కొనేందుకు వచ్చే భక్తులు నేరుగా ఒకే వద్ద వారికి కావలసిన రీతిలో రాహు కేతు పూజలు టికెట్లు తీసుకొని. రాహు కేతు పూజలు నిర్వహించుకోవచ్చు అని తెలియజేశారు. త్వరలో రాహు కేతు పూజలకు పూర్తిగా డిజిటల్ మనీ రూపంలో డబ్బులు చెల్లించే విధంగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు.

## దడపుట్టిస్తున్న ఎస్సై నాగరాజు దాడులు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** నాయుడుపేట – పూతలపట్టు 71 వ జాతీయ రహదారిపై ఎస్సై కె నాగరాజు దాడులు వాహనదారులకు దడపుట్టిస్తున్నాయి. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశానుసారం జరుగుతున్న ఈ దాడుల వల్ల రోడ్డు ప్రమాదాలు అనూహ్యంగా తగ్గిపోవడంతో పోలీసుల దాడులకు విశేష స్పందన లభిస్తోంది. రహదారిపై ప్రయాణించే ఆటోలు, మోటారు



సైకిళ్లు, ట్రాక్టర్లను ఎస్ఐ నాగరాజు బృందం ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి వాహనానికి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి వాహనానికి ఆర్ సి, పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఎఫ్ సి వంటి రికార్డులను పరశీలించి వాహనదారులకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులు,బ్యాడ్జీలు తనిఖీ చేస్తున్నారు. వీటిలో ఏది లేకున్నా జరిమానా విధిస్తున్నారు. ఒక్కో సందర్భంలో వాహనాన్ని స్వాధీనం చేసుకొని వాహనదారులపై కేసులు పెట్టడం వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేదానికి కూడా సాహసిస్తున్నారు. పోలీసులు అధికారుల చేపడుతున్న చర్యల వల్ల అన్ని రకాల వాహనదారులలో వాహనాలు నడిపేందుకు భయపడుతున్నారు.

## అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**పుంగనూరు, మేజర్ న్యూస్:** మండలపరిధిలోని సుగాల మిట్ట పంచాయతీ సుగాలమిట్ట సమీపంలో అనుమానాస్పద స్థితిలో శుక్రవారం60 సంవత్సరాల వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ టెండర్‌పై పంచాయతీ ఇఓకి వినతి పత్రం

**రేణిగుంట, మేజర్ న్యూస్:** రేణిగుంట పంచాయితీకి చెందిన రూములు, వారపు సంత, కూరగాయల మార్కెట్ సంబంధించిన వేలం పాటను సంబంధించి టిడిపి జనసేన పార్టీ పంచాయతీ పాలక మండలి 15 వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి, 5 వ వార్డు సభ్యులు వి.మహబూబ్ పంచాయతీ కార్యదర్శి మణికి వినతి పత్రం అందించారు.వేలం పాటను సంబంధించి



పత్రికా ప్రకటన చేసిన తర్వాత మాత్రమే వేలం వేయుటకు మరియు ధరావత్తు రుసుము, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించుటకు 10 రోజుల పాటు వాయిదా వేయాలని శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

## 17వ జూనియర్ జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో మెరిసిన అంతరిక్ష కేంద్రీయ విద్యాలయ శ్రీహరికోట విద్యార్థి

సూళ్లూరుపేట రూరల్, మేజర్ న్యూస్:



యూనివర్సిటీ ఆఫ్ జమ్ములో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ ఛాంపియన్షిప్ పోటీలలో , 22 రాష్ట్రాల నుండి 450 విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో ఏడో తరగతి చదువుతున్న శ్రీ విష్ యాదవ్ బిట్రగుంట అనే విద్యార్థి అండర్ 15 కేటగిరీలో జాతీయస్థాయిలో బ్రాంజ్ మెడల్ ని కైవసం చేసుకున్నారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ ప్రోత్సాహంతో, కంట్రోలర్ ఎం శ్రీనివాసులు రెడ్డి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయ, ఉప ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస గాంధీ ,సీమ , సుమిత్ కుమార్ యాదవ్ కు ప్రత్యేక శిక్షణలో ఈ విజయాన్ని సాధించడం జరిగింది. వీరికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## నైరుతి బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం

**శాంతిపురం, మేజర్ న్యూస్:** శుక్రవారం గడిచిన 6 గంటల్లో గంటకు 10 కిమీ వేగంతో కదులుతున్న తీవ్రవాయుగుండం ప్రస్తుతానికి పుదుచ్చేరికి 320 కి.మీ, చెన్నైకి 340 కి.మీ. దూరంలో కేంద్రీకృతం వాయువ్య దిశగా కదులుతూ రాగల 3 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం శనివారం మధ్యాహ్నానానికి ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్, మహాబలిపురం మధ్య పుదుచ్చేరి దగ్గరలో తుపానుగా తీరం దాటే అవకాశం దక్షిణకోస్తాలో ఇవాళ, శనివారం అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, రేపు కొన్నిచోట్ల అతితీవ్రభారీ వర్షాలురాయలసీమలో ఇవాళ,రేపు అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొన్నిచోట్ల అతితీవ్రభారీ




వర్షాలు కురిసే అవకాశం మిగిలినచోట్ల ఆదివారం వరకు విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం తీరం వెంబడి 70–80కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి

**– ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి**

**పలమనేరు, మేజర్‌న్యూస్:** రైతన్నల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వారిలో మరింత అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉందని ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానంగా ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలు ఈ ప్రాంత రైతులకు సక్రమంగా చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలమనేరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఉద్యాన శాఖ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అందుతున్న పలు పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్ రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన పథకాల ద్వారా అందుతున్న సబ్సిడీలు పండ్ల తోటల విస్తరణ పథకంలో మామిడి జామ,దానిమ్మ తదితర పంటలతో పాటు యంత్రాలకు అందిస్తోన్న రాయితీలను గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజ్,మినీ ట్రాక్టర్లు,పాలి హౌస్ లు, ప్యాక్ హౌస్ లు,స్ప్రేయర్లు లను నియోజకవర్గంలోని ఎంతమంది రైతులకు ఇచ్చారనే వివరాలను రాబట్టారు. ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తున్నప్పటికీ రైతులు వాటిని సద్వినియోగం



చేసుకోకపోవడానికి గల కారణం రైతులకు సరైన అవగాహన లేకపోవటమేనన్నారు. కాబట్టి అధికారులు ప్రభుత్వ పథకాలను రైతులకు విపులంగా వివరించి ఈ ప్రాంత రైతన్నల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పలమనేరు, పుంగనూరు ఉద్యాన శాఖ అధికారులు లక్ష్మీ ప్రసన్న,వరప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత పుస్తకాలు పంపిణీ

**పుంగనూరు, మేజర్ న్యూస్:** భగవద్గీత పుస్తకాలను శుక్రవారం ఎన్.వి.ఆర్ ట్రస్ట్ అధినేత జనసేన నేత ఎన్ వేణుగోపాల్ రెడ్డి మండలంలోని చదళ్ళ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సప్తమాతృక చౌడేశ్వరి అమ్మవారి మండపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి



ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ,హిందూ ధర్మ గ్రంథమైన భగవద్గీతను అందరూ అభ్యసించాలని కోరారు. యువతీ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనీ, ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడుచుకుంటే దేశానికి మేలు చేసిన వారవుతారన్నారు. సనాతన ధర్మ విలువలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ వేణుగోపాల్ రెడ్డిని హిందూ జగన్ సమితి సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ రెడ్డి, వైద్యురాలు ఈశ్వరమ్మ,త్రిమూర్తి రెడ్డి, చిన్నా రాయల్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు విరుపాక్షి ట్రస్ట్ సభ్యులు నరేంద్ర రెడ్డి, నారాయణరెడ్డి,పెద్ద సంఖ్యలో విద్యార్థులు ,జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పింఛన్లు పంపిణీ



**తడ, మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద డిసెంబర్ నెల పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందుగానే అందించనున్నట్లు ఎంపీడీవో ఎన్ విజయ కుమార్ తెలిపారు డిసెంబర్ ఒకటవ తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో మండలంలో ఉన్న 5936 మంది పెన్షన్ దారులకు రెండు కోట్ల 52 లక్షల 12వేల 500 రూపాయలు నగదును పెన్షన్ దారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 30వ తేదీ ఏదైనా కారణాలతో తీసుకోలేని వారికి రెండవ తేదీ సోమవారం అందించనున్నట్లు తెలిపారు అప్పటికి తీసుకొని వారికి రెండు నెలలు మొత్తాన్ని కలిపి జనవరి ఒకటో తేదీన ఇస్తామని అన్నారు. నవంబరు నెలలో పెన్షన్ తీసుకొని వారికి రెండు నెలలు మొత్తం కలిపి నేడు అందజేయనున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క పెన్షన్ దారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## టాస్క్ ఫోర్సు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎండీ షరీఫ్

**తిరుపతి ప్రెస్ క్లబ్, మేజర్‌న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఎఎస్టీఎఫ్) డీఎస్పీగా ఎండీ షరీఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన టాస్క్ ఫోర్స్



ఇన్చార్జి, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడును కలుసుకున్నారు. తరువాత టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ తో సమావేశమయ్యారు. శ్రీనివాస రెడ్డి ఇది వరకు కడప టౌన్ డీఎస్పీగా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి విశ్వకర్మ నైపుణ్య సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,



ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పాల్గొని ప్రారంభించారు. శుక్రవారం స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో ప్రధానమంత్రి విశ్వకర్మ నైపుణ్య అభివృద్ధి సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం నైపుణ్యం అభివృద్ధి, వ్యాపార వృద్ధి కోసం చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రూ. 3 లక్షల వరకు ఎలాంటి హామీ లేకుండా రుణాన్ని అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ వైద్యం శాంతారామ్, డాక్టర్ వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, సత్యేంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగుమందుల దుకాణం తనిఖీ



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలం లోని ఎరువులు పురుగు మందుల దుకాణాలలో నిబ్బంధనలను అతిక్రమిస్తే ఫర్టిలైజర్స్ షాపులపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగార్జునసాగర్ హెచ్చరించారు. శుక్రవారం మండలయిఎశ్రీతీ రావిగుంట పాలెం, వాకాడు గ్రామాలలో వున్నా ఫర్టిలైజర్ షాప్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపులో ఉన్న రికార్డులను, ఎరువులు దుకాణాలలో ఉన్నటువంటి మందులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిబంధన ప్రకారము ఫర్టిలైజర్ షాప్ యాజమానులు విక్రయాలు జరపాలని, చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు, ఫర్టిలైజర్ షాపు నిర్వహాలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప, సహాయకులు లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

## వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పుది పట్లలో వెలసి వున్న వైష్ణవీ దేవి ఆలయంలో రాహుకాలం సందర్భంగా ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని,వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా



అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు.అశేష సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## 260 మంది రైతుల మట్టి నమూనా సేకరణ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న రైతులు 260 మంది వద్ద 2023-24 సంవత్సరం నందు, మండలంలో 13 రైతు క్షేత్రాలు లకు సంబంధించిన రైతుల పొలాల్లో 260 మట్టి నమూనాలు కో ఆర్డినెట్ ద్వారా రైతు క్షేత్ర సిబ్బంది సేకరించడం జరిగినది, దీనికి సంబంధించి వారిచే ఎంపిక చేయబడిన ఆలత్తురు, బట్టువారిపల్లి, కొల్లగుంట, గ్రామలందు మట్టి నమూనాలు సేకరించిన రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఏవో లక్ష్మీప్రసన్న హెల్త్ కార్డులు అందించి, ఆ కార్డుల ఆధారంగా ఏ రైతు పొలంలో ఏయే పోషకాలు ఉన్నాయి, ఇంకా వివిధ పంటలకు అనుగుణంగా ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో అన్న విషయాలు మీద రైతులకు శిక్షణ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కల్పన, రైతులు పాల్గొన్నారు.



## హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్ కన్నుమూత



**నాయుడుపేట రూరల్, మేజర్‌న్యూస్:** గొట్టిప్రోలు ప్రాథమిక వైద్యశాలలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బల్లి ప్రభాకర్(51) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా పట్టణంలో నివాసం ఉంటున్నారు. ప్రభాకర్ పార్థివ దేహాన్ని ఆయన స్వగ్రామమైన ఓజిలి కి తరలించారు. స్నేహశీలి, మృధు స్వభావి అయిన ప్రభాకర్ కన్ను మూసిన సమాచారం తెలుసుకున్న సహ ఉద్యోగులు, మిత్రులు శ్రేయోభిలాషులు కన్నీటి పర్యంతమై ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. భగవంతుడు వారికి మనోదర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రభాకర్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బొమ్మేపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని బొమ్మేపల్లి పంచాయతీలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా నమోదు చేయించారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావిళ్ళ వెంకటాద్రి నాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరప్రసాద్, టిడిపి నాయకులు శ్రీరామ నాయుడు, సతీష్, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పురుగుమందు తాగి వ్యక్తి మృతి



**తడ, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వాటంబేడు గ్రామానికి చెందిన పాలవాక్కం రవి (58) పురుగుమందు తాగి మృతి చెందాడు. తడ పోలీసుల వివరాలు మేరకు మృతి చెందిన వ్యక్తి కి చాలా కాలం నుండి ఎడమ చేయి నొప్పితో బాధపడుతూ ఉండడంతో ఇటీవల సర్జరీ చేసుకున్నాడు డాక్టర్ అతనిని బరువు ఎత్తకూడదని చెప్పినప్పటికీ తన సొంత పొలమునకు యూరియా ముందును వేయడానికి కూలి మనుషులు రాకపోవడంతో అతనే స్వయంగా యూరియా బస్తాన్ని ఎత్తుకొని పొలంలోకి పోవడంతో సర్జరీ చేసుకున్న చేయి విపరీతమైన నొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేరని సమయంలో పురుగుమందు తాగి పడి ఉండగా అప్పుడే ఇంటికి వచ్చిన తన భార్య చూసి చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో వెంటనే అతని సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె కొండప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చుక్కల శంకరయ్య పార్టీవదేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**కే వి బి పురం, మేజర్‌న్యూస్:** శ్రీ కాళహస్తి మండలం పెంకులపాడు హరిజనవాడ వైయస్సార్ సిపి నాయకుడు చుక్కల మహేష్ తండ్రిగారైన చుక్కల శంకరయ్య అనారోగ్యముతో మరణించినారు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సాధన మున్నా బులెట్ జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## రాహుకాల అభిషేకంలో పాల్గొన్న భక్తులు

**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో శుక్రవారం లోక సుభిక్షం కోరుతూ రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ గావించారు. అనంతరం రాహుకాల సమయంలో దంపతుల సమక్షం నందు రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు. పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు శుక్రవారం ఉచిత అన్న ప్రసాద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ఈవో ఏకాంబరం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బయోట్రిమ్ వద్ద పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టండి : కమిషనర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని కరకంబాడి రోడ్డు మార్గంలో గల బయో ట్రిమ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఇంజినీరింగ్, హెల్త్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. ఉపాద్యాయ నగర్ రోడ్డు, బయో ట్రిమ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, మురుగు నీటి కాలువల నిర్మాణం పై ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ అధికారులతో శుక్రవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బయో ట్రిమ్, ఉపాద్యాయ నగర్ రోడ్డు మధ్య ఉన్న మురుగునీటి కాలువ సరిగా లేనందున అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, వీధికుక్కలు లోనికి వస్తున్నాయని, జింకలు, దుప్పులు రోడ్లపై వస్తున్నాయని బయో ట్రిమ్ అధికారులు, ప్రజలు పిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు తనిఖీ కూడా చేయడం జరిగిందన్నారు. మానస సరోవర్ నుండి వినాయక సాగర్ వరకు ఉన్న మురుగు నీటి కాలువను నిర్మించాలని ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే గోవింద ధామం ఎదురుగా చిన్న చిన్న దుకాణాలు ఉండడం వలన జింకలు, వాటికోసం చిరుత పులులు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ఈ దుకాణాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బయో ట్రిమ్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని హెల్త్, వెటర్నరీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.సి.పి. మాహాపాత్ర, డి.ఈ.లు, ఏ.సి.పి.లు పాల్గొన్నారు.



## పార్థివలింగ పూజకు సర్వం సిద్ధం



**పుంగనూరు, మేజర్ న్యూస్:** పట్టణంలోని కోనేటి వద్ద వెలిసిన శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి సమేతకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ కోనేరులో వందలాది మహిళలతో భక్తి శ్రద్ధలతో ప్రతి ఏడు నిర్వహించే పార్థివ లింగ పూజ కార్యక్రమం 30వ తేదీశనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఘనంగా ప్రారంభం కానున్నాదని ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బయ్య, రామచంద్రలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉన్నదని పుంగపురిగా పులి నాడుగా పిలవబడిన రాజ్యంలో జమీందారు పరిపాలనలో కాశీ వేశ్వేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్నదని స్థల పురాణంలో భక్తులు ఇక్కడ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించిన సకల పాపాలు హరించునని భక్తుల నమ్మకం. ఈ పార్థివలింగ పూజ పురాణంలో ప్రాచీనకాలం నుండి దేవతలు సైతం అత్యంత ప్రాముఖ్యతగా నిర్వహించే పూజా అని కార్తీక మాసం బహుళ పంచమి అమావాస్యనాడు పార్థివలింగం పూజ నిర్వహించిన వారికి అనుకున్న కార్యాలు నెరవేరుతాయని, పురాణాల్లో రావణాసురుడు సైతం మహాశి వునికి గోకర్ణ ప్రదేశం లో పార్థివలింగం పూజ నిర్వహించడంతో అత్యంత శక్తి వంతుడయ్యాడని విన్నాం. పుంగనూరు కోనేరులో పార్థివలింగం పూజకు సుమారు 500 మందికి 11 పుట్టల మన్ను, సుగంద ద్రవ్యల మిశ్రమంతో తయారు చేసిన పార్థివలింగాలకు భక్తి శ్రద్దలతో పూజిస్తారన్నారు.



## రాష్ట్ర అధ్యక్షులను కలిసిన తెదేపా నేతలు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు ని,రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణ రాజును సూళ్లూరు పేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా.నెలవల విజయ్ శ్రీ,సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు రేణిగుంటలోని విమానాశ్రయం నందు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మురళి నాయుడు, సిద్దలయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు పాల్గొన్నారు.



## మిథున్ రెడ్డిని కలిసిన కామిరెడ్డి

**పెళ్లకూరు, మేజర్ న్యూస్:** రాజాంపేట పార్లమెంట్ ఎంపి,ప్రకాశం నెల్లూరు జిల్లాల వైయస్సార్సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తిరుపతిలోని ఆయన కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూలబొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై అదేవిదంగా తాజాగా ఉన్న రాజకీయ విశేషాలను వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి,చిల్లకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, వైసీపీ నాయకులు పాపాడి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.



## గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కృషి చేస్తా..



**తిరుపతి రూరల్, మేజర్ న్యూస్:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతానికి చేయడానికి కృషి చేస్తానని చంద్రగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఐరలా లోకేష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల పార్టీ, చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఈ కాంగ్రెస్ పార్టీని చంద్రగిరి నియోజకవర్గంలో గ్రామ గ్రామాలు పర్యటించి పార్టీని బలోపేతం చేస్త అని అన్నారు. ఈ సందర్భంగా తనకి ఈ పదవి వచ్చిన సందర్భంగా జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షురాలు వైస్ షర్మిల రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పోటుగారి భాస్కర్ తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున, శివశంకర్, చిరంజీవి, కలింద్ర, శివ బాలాజీ, స్వరూప్ నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, మందుల దుకాణాల తనిఖీ



**కోట, మేజర్‌న్యూస్:** మండలంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) వెంకటగిరి ఎం.నాగార్జున సాగం, మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్ కోట మండలం లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా 2 షాపులలో 45.8 మెట్రిక్ టన్నులు ఎరువులను ఫారంలు' ఎరువుల లైసెన్సులలో నమోదు కానందు వలన 45.8 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువుల లైసెన్సు కలిగిన డీలర్లు అందరూ ఎరువులను రిజిష్టర్ లో నమోదు చేయాలని,రైతులకు బిల్లులు ఇవ్వాలని, ధరలకే అమ్మలని, ఎరువుల నిల్వ వివరాలు మరియు వాటి రేట్లను స్టాక్ బోర్డు లలో చూపాలని మరియు ఫారం' లను ఎరువుల లైసెన్సు లో నమోదు చేసుకోవాలని ఎరువుల డీలర్లు అందరికీ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలా కాని ఎడల ఎరువుల డీలర్లు మీద తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# విద్యుత్ ప్రమాదం వల్ల ఏనుగులు మరణించకుండా చర్యలు చేపట్టండి

**చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** అటవీ ప్రాంతంలో ఏనుగులు విద్యుత్ తీగల కారణంతో మరణించకుండా ప్రమాదాలను నివారించేందుకు అటవీ శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయ సమావేశ మందిరము నందు జిల్లా అటవీ శాఖ అధికారులు, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ, ఈఈ, డిఈ, ఎఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ట్రాన్స్ఫార్మర్ల షిఫ్టింగ్‌కు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతాలు కలిగిన బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాని, వి.కోట, పులిచెర్ల, కుప్పం మండలాల్లో 491 ట్రాన్స్ఫార్మర్లు ఉన్నాయన్నారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ల వల్ల అటవీ, వన్య జంతువులకు ప్రాణహాని పొంచి వుందని, ట్రాన్స్ఫార్మర్ల వల్ల అటవీ, వన్య జంతువులకు ప్రాణహాని కలిగించే విధంగా వుంటే వాటిని జంతు నిర్మాణుష్య ప్రాంతాలను గుర్తించి వాటిని స్థాన మార్పిడి చేయాలని విద్యుత్ శాఖ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. స్థాన మార్పిడి చేసేందుకు అటవీ విద్యుత్ శాఖలు జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ భరణి, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, ఈఈ జగదీష్, డిఈ, ఎఈ పాల్గొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసిన ఎంవిఐ

**గూడూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని తిప్పవరప్పాడు వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శాంతి వాహనాలు తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవీకరణ పత్రాలులేని వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎంవిఐ మాట్లాడుతూ వాహనదారులు నడిపే సమయంలో ఆయా వాహనాలకు సంబంధించిన పత్రాలను వాహనంలోనే భద్రపరుచుకుని తనిఖీల సమయంలో చూపించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. సిబ్బంది కరీముల్లా, శ్రీనివాసులు ఉన్నారు.



## మొదటి ఘాట్‌లోని లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా ప్రత్యేక అభిషేకం



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గం చెంత వెలసివున్న లక్ష్మీనరసింహస్వామికి శుక్రవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం అడిషనల్ ఈవోను శ్రీవారి ఆలయపోటు పేష్కార్ మునిరత్నం సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



# అన్నం లేక అల్లాడిన విద్యార్థులు... రసంతో కడుపు నింపుకున్న వైనం

**ఓజిలి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటించిన 100మంది విద్యార్థులు**

**ఓజిలి, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతానికై అనేక లక్ష రూపాయల నిధులు కేటాయించి, ప్రతి పేదవాడికి మంచి విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుంది. కానీ పాఠశాలలోని అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వం అనుకునే లక్ష్యం నెరవేరడంలో వెనకడుగు వేయవలసి వస్తుంది. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఓజిలి హైస్కూల్లో తీరు మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం దాదాపు 100మంది విద్యార్థులకు అన్నం లేక ఆకలి కడుపులతో అలమటించారు. రసంతో ఆ విద్యార్థిని విద్యార్థులు కడుపు నింపుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఓజిలి మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో దాదాపు 100మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సకాలంలో అందక ఆకలితో అలమటించారు. పాఠశాలలో 220 మంది పైబలుక మంది విద్యార్థులు ఉండగా దాదాపు 100మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం లేక ఆకలితో అల్లాడి రసంతో కడుపు నింపుకున్నారు. సరైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు కంటతడి పెట్టారు. నిత్యం ఉడికి ఉడకని అన్నం, నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూప్రకారం అందించాలి. అయితే ఇక్కడ అధికారులు మెనూ ఏమాత్రం పాటించట్లేదు. మెనూ ప్రకారం కాకుండా విద్యార్థులకు అరకొర భోజనం వడ్డిస్తూ విద్యార్థులను అర్ధ ఆకలితో కడుపు నింపుతున్నారని విద్యార్థుల వాపోతున్నారు. పిల్లలకు సరైన భోజనం ఇవ్వకుండా పిల్లల కడుపు కొడుతూ అధికారులు తమ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల జేబులు ఫుల్ విద్యార్థులు కడుపులు నిల్ అన్న చందాన ఓజిలి మండల కేంద్రంలోని హై స్కూల్ దుస్థితి ఉంది ఉన్నత అధికారులు పాఠశాలను పరిశీలించి మంచి భోజనం అందించేలాగా చర్యలు తీసుకోవాలనికోరుతున్నారు.

**విచారించి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం:ఎంఈఓ**

మండల విద్యాశాఖ అధికారిణి శైలజాను ఫోన్లో వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ నేను కోటలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులు తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ మీటింగ్లో ఉన్నానని ఈ విషయం నా దృష్టికి సాయంత్రం వచ్చిందని రేపు స్కూలుకు వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని మరల ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటానని మండల విద్యాశాఖ అధికారిణి శైలజా తెలియజేశారు.



## ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో.. ఏడుగురికి ఆరేళ్లు జైలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేసిన ఏడుగురికి ఆరేళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు,మనిషికి 6 లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ,తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారు.ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా టాస్క్ ఫోర్సు ఇన్చార్జి,తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణతో టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ పర్య వేక్షణలో డీఎస్పీలు బాలిరెడ్డి, శ్రీనివాసరెడ్డిల మార్గనిర్దేశంలో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని,ప్రాసిక్యూషన్ ద్వారా కోర్టులో పకడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించగలిగేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగం గా కరకంబాడి బీటు టీఎన్‌పాలెం సెక్షన్లో పట్టుబడిన ఏడుగురు ముద్దాయిలకు ఈ శిక్ష పడింది. వీరిలో చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగయ్య, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టి.బంగారయ్య, తమిళనాడుకు చెందిన కే.మురగయ్య ఉన్నారు. వీరికి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు, మనిషికి రూ.6లక్షల చొప్పున జరిమానా విధించారు. కోర్టు ఆదేశాల మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీనిపై టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని విలువైన ఎర్ర చందనం చెట్లనునరికి అక్రమ రవాణా చేసే నేరస్తులకు శిక్ష తప్పదన్నారు.

**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

చంద్రగిరి నియోజకవర్గం :
1.చంద్రగిరి, 2.పాకాల, 3.చిన్న గొట్టికల్లు, 4.ఎర్రవారి పాలెం

వెంకటగిరి నియోజకవర్గం :
1. బాలాయపల్లి

సత్యవేడు నియోజకవర్గం :
1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం, 4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

## పేద ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంస్థ అధినేత, ఆ సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు అన్నారు. శాంతిపురంలోని మండల వ్యవసాయ కార్యాలయం ఎదురుగా నూతనంగా బి ఆర్ డి క్లినిక్ ను ప్రారంభించమని ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ క్లినిక్ లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కడుపు నొప్పి, షుగర్ పరీక్షలు, సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స, నెలసరి సమస్యలు, ఐయుఐ, సాధారణ కాన్పులు, నొప్పి లేని కాన్పులు, చెవి, ముక్కు, గొంతు కు సంబందించిన వ్యాధులు, చిన్న పిల్లలకు సంబంధించిన అన్ని వ్యాధులకు చూడబడును, సీనియర్ గైనకాలజిస్ట్ డా. హరిత శాంతిపురం బి.ఆర్.డి క్లినిక్ నందు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని, గర్భిణిలకు సంబంధించిన అన్ని స్కాన్ చేస్తారని తెలిపారు ఈ అవకాశాన్ని ప్రతి ఒకరు వినియోగించుకోవాలని అలాగే అతి తక్కువ ధరకే ప్రెవేంటివ్ హెల్త్ ప్యాకేజీ సౌకర్యం అందుబాటులో ఉన్నాయని డా. బి ఆర్ సురేష్ బాబు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకుడు ఆర్థిక సహాయం అందించిన నాయకులు



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆర్.కే.వి.బి. పేట పంచాయతీ ఇందిరా కాలనీ చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ కార్యకర్త దామోదరం గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేకుండా తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉన్న అతనికి ఎడమకాలు తీసి వేయడం జరిగింది విషయం తెలుసుకున్న మండల నాయకులు తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇస్తూ 11000 రూపాయలు ఆర్థిక సాయం వారి కుటుంబానికి అందించిన కార్వేటినగరం మండలం తెలుగు దేశం పార్టీ నాయకులు అధ్యక్షులు చెంగల రాయ్ యాదవ్, అందజేశారు. వాసుదేవ రెడ్డి,నాగేశ్వర రాజు,రవి యాదవ్,జగన్నాథం,రాజేంద్ర రెడ్డి,హేమంత్ రెడ్డి,కృష్ణయ్య ,సందాని,సోమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### అనుభవంలో గల భూమి అక్రమపట్టా



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలం లోని చారాల రెవిన్యూ సర్వే నెంబర్ 112/29 నందు 0.15 సెంట్లు భూమి తాతల తరాల నుండి భూమిని సాగుచేస్తున్నామని,మాతాతలు,మా కుటుంబ సభ్యులు చనిపోతే అక్కడే ఖననం చేసేవాళ్ళమని, అక్కడ మాతాత,అవ్వ,పెద్దనాన్న ,పెద్దమ్మ సమాధులు కూడా ఉన్నాయని ఈ భూమిని మా గ్రామానికి చెందిన కె.సరిత భర్త రమేష్ పేరున ఖాతా నెంబర్ 859గా ఆన్ లైన్ వస్తుందని,కావున వెంటనే గ్రామంలో విచారణ చేసి రదు ్దపరచాలని స్థానిక తాహాశిల్దార్ ను కలసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సమస్య పై స్పందించిన తాహాశిల్దార్ వెంటనే విచారణ చేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది.

## నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న పింఛన్ దారులందరికి 1వ తేది ఆదివారము కారణంగా రేపు అనగా 30.11.2024 వ తేదీననే కార్వేటినగరం మండలము నందు 15 గ్రామ సచివాలయములలోని లబ్ధిదారులకు ఎన్ టి ఆర్ భరోసా ఫించన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.

## వైసీపీ నేతలను పరామర్శించిన కామిరెడ్డి



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని టెంకాయతోపు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పి.వి రమణా రెడ్డి ని అదేవిదంగా మండలంలోని నెలబల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అట్ల గోపాల్ ను ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి శుక్రవారం వారిని పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అట్ల గోపాల్ ను పరామర్శించి ఆరోగ్య యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెళ్లకూరు మండల ఎంపిపి పోలంరెడ్డి శేఖర్ రెడ్డి,చిల్లకూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పగడాల హరి బాబు రెడ్డి,వైసీపి నాయకులు పాపడి ప్రతాప్ రెడ్డి,సాగి జితేంద్ర,బండి బాలు,అట్ల కృష్ణయ్య గౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్ :** సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఫారసీ ప్రాక్టీస్ విభాగం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్, జె.ఎన్.టి.యునివర్శిటి అనంతపురం సంయుక్త ఆధ్వర్యంలో "రైజ్ ఆఫ్ డిజిటల్ ఫారసీ" అనే అంశంపై ఐదు రోజులు పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యం.నిరంజన్ బాబు మాట్లాడుతూ ఆధునిక మార్పులకు అనుగుణంగా బోధన సాగాలన్నారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులకు ధ్రువపత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడిని స్ట్రేటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరక్టర్ ప్రొఫెసర్ శరవణ కుమార్, కంట్రోలర్ ఆఫ్ పరీక్షలు డాక్టర్ జి. సతీష్ కుమార్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జ్యోతి బసిని, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు పెన్షన్ పంపిణీ-ఒకటో తేదీ సెలవు, ముందుగానే పంపిణి

**నాయుడుపేట రూరల్, మేజర్‌న్యూస్:** ఏపీలో పింఛన్‌లు తీసుకునే వారికి ప్రభుత్వం తీపికబురు ఏపీలో పింఛన్‌లు తీసుకునేవారికి ప్రభుత్వం తీపికబుర్లు చెప్పింది. ఈ నెల ఒక రోజు ముందే పింఛన్ పంపిణీ చేస్తోంది. డిసెంబర్ 1న ఆదివారం కావడంతో.. ఒకరోజు ముందుగా నవంబర్ 30న పింఛన్ పంపిణీ చేయనున్నారు. మరోవైపు ప్రతి నెలా కొందరు పింఛన్ తీసుకోలేకపోతున్నారు.. అందుకే ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మూడు నెలలకోసారి పింఛన్ తీసుకునేలా మరో వెసులుబాటు కల్పించింది.. అంటే రెండు నెలలు వరుసగా తీసుకోకపోతే, మూడో నెలలో కలిపి ఒకేసారి (రూ.12వేలు) డబ్బుల్ని తీసుకోవచ్చు. అంతేకాదు ఒకవేళ పింఛన్ తీసుకునే లబ్ధిదారుడు చనిపోతే.. ఆ మరుసటి నెల నుంచే ఆయన భార్యకు వితంతువు పింఛన్ అందిస్తారు. గతంలో కూడా సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో.. ఆగస్టు 31నే పింఛన్ పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సారి కూడా అదే విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. డిసెంబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీనే పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు సిద్ధమయ్యారు. ఈ నెల 28న లబ్ధిదారుల సంఖ్య మేరకు ప్రభుత్వం.. పింఛన్ డబ్బుల్ని బ్యాంకు అకౌంట్‌లో జమ చేయనుంది. ఈ నెల 29న ఆ డబ్బుల్ని సచివాలయ సిబ్బంది విత్ డ్రా చేసి.. 30న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అర్హత ఉంటే చాలు.. ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంతేకాదు కొత్తగా పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఉంది. జనవరి నుంచి కొత్త పింఛన్‌లను ప్రభుత్వం అందజేయాలని భావిస్తోంది. అంతేకాదు అనర్హుల్ని కూడా గుర్తించే పనిలో ఉంది ఏపీ ప్రభుత్వం. అయితే వరుసగా మూడు నెలల పాటు లబ్ధి పొందని వారిని శాశ్వత వలసదారులుగా గుర్తించి పింఛను నిలిపివేస్తారు అధికారులు. శాశ్వత వలసదారులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్లు ద్వారా పింఛను నిలిచిన మూడు నెలల లోపు పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. వారికి బకాయిలు అందజేయకుండా ప్రభుత్వం అనుమతించిన నెల నుంచి పింఛను అందజేస్తారు. గత ప్రభుత్వ హయాంలో కచ్చితంగా ఏ నెల పింఛన్.. ఆ నెలలోని తొలి నాలుగైదు రోజుల్లో తీసుకోవాల్సిందే. ఆ తర్వాత లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లినా డబ్బులు ఇచ్చేవారు కాదు. అంతేకాదు రెండు నెలలు వరుసగా పింఛన్ తీసుకోకపోయినా రద్దు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం లబ్ధిదారులు వరుసగా రెండు నెలల పింఛన్ తీసుకోకపోయినా.. మూడో నెల ఒకేసారి డబ్బుల్ని తీసుకోవచ్చు. పింఛన్ తీసుకునే లబ్ధిదారుడు చనిపోతే.. అతడి భార్యకు వితంతువు పింఛన్ మంజూరు చేయాలంటే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. లబ్ధిదారుడు చనిపోతే ఆయన భార్యకు ఆ పింఛన్‌ను బదలాయిస్తారు. భర్త మరణ ధృవపత్రాలను సచివాలయాల్లో అందజేస్తే ఆ మరుసటి నెల నుంచి పింఛన్ అందిస్తారు.

## పలమనేరు ఆర్డీఓను కలిసిన బోయకొండ గంగమ్మ దేవస్థానం నిర్వాసితు



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని దిగుపల్లి పంచాయతీ గంగాపురం బోయకొండ గంగమ్మ కింది గ్రామస్తులు శుక్రవారం చిత్తూరు జిల్లా సిపిఎం వ్యవసాయ కార్యదర్శి ఓబుల్ రాజు ఆధ్వర్యంలో పలమనేరు ఆర్డిఓ భవానిని కలిసి తాము బోయకొండ గంగమ్మ దేవస్థానం కింద చిన్నచిన్న అంగళ్లు పెట్టుకుని వచ్చిన భక్తులకు వండి పెట్టుకుని వ్యాపారం చేసుకుని జీవనం చేస్తూ ఉండేవారని, గత వైసిపి ప్రభుత్వం లో తమ ఇళ్లను, అంగళ్లను భూములను దేవస్థానం పునరుద్ధీకరణ కోసం అని చెప్పి దౌర్జన్యంగా జెసిబి లతో కూలగొట్టి కనీసం నష్ట పరిహారం కూడా ఇవ్వకుండా ఇతరులకు దారాదత్తం చేశారని వాపోయారు. అక్కడ కట్టిన దుకాణ సముదాయంలో తమకు ప్రాధాన్యమిస్తారని నమ్మబలికారు కానీ మాలో ఏ ఒక్కరికి దుకాణ సముదాయంలో రూములు ఇవ్వక అధిక మొత్తంలో అడ్వాన్సులు తీసుకుని బడా వ్యాపారస్తులకు అప్పచెప్పారని, ఈ విషయమై ఇంతకు మునుపు అనేకసార్లు చౌడేపల్లి తహశీల్దారు వారికి చిత్తూరు కలెక్టర్ వారికి పలమనేరు ఆర్డిఓ వారికి వినతి పత్రాలు సమర్పించారని, అయినా ఇంతవరకు తమకు న్యాయం జరగలేదని బాధపడ్డారు. వారి వినతి పత్రమును స్వీకరించిన పలమనేరు ఆర్డిఓ భవాని మాట్లాడుతూ వీటిపై సమగ్ర నివేదిక తెప్పించుకొని, ప్రత్యక్షంగా పర్యవేక్షించి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాపురం గ్రామస్తులు జయప్ప రెడ్డప్ప హరి గణేష్ పద్మ, సీతమ్మ ఎల్లప్ప వెంకటరమణ మల్లమ్మ, రెడ్డమ్మ పార్వతి మొదలగువారు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల వినియోగంపై విద్యార్థులు ర్యాలీ



**కార్వేటినగరం మేజర్ న్యూస్:** మండల కేంద్రం లో రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, విద్యార్థినీ, విద్యార్థులచే, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈ సి కన్సల్టెంట్ శాంతి మాట్లాడుతూ మలమూత్రాలు బహిరంగంగా విసర్జించడం వల్ల కలిగే వ్యాధుల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించిన ద్వారా పరిశుభ్రత కాపాడుకో వచ్చారు. ప్రతి ఒక్కరూ మరుగుదొల్లు నిర్మించుకొని వాడుకోవాలన్నారు. విద్యార్థినిచే ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, గాయత్రి దేవి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, ఇన్చార్జి ఈ పిఓపిఆర్డి నాగరత్నమ్మ, మండల్ కోఆర్డినేటర్ మండల కోఆర్డినేటర్ ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** నగరంలో వెలిసిన ద్రౌపతి సమేత ధర్మ రాజు ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాణిపాకం గణనాధునికి రూ, 20,92 లక్షల ఆదాయం

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయం నందు శుక్రవారం ఉదయం నిర్వహించిన ఆన్లైన్ టెండర్లు, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంల ద్వారా 20,92,000 వేలు రూపాయలు ఆదాయం వచ్చింది. అందులో ( 1). షాపింగ్ కాంప్లెక్స్ నందు షాప్ నెంబర్ 27 నకు (1 సంవత్సరం కాలపరిమితి) - 16,80,000/- రూపాయలు, (2). శ్రీ విగ్నేశ్వర కళ్యాణమండపం వద్ద బంకు నిర్వహించుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాలపరిమితి) - 4,12,000/- రూపాయలు. మొత్తం 20,92000 వేలు రూపాయలు ఆదాయం లభించింది. ఈ వేలంపాట కార్యక్రమంలో దేవస్థానం ఎఈఓ లు రవీంద్ర బాబు,హరిమాధవ రెడ్డి, దేవాదాయశాఖ అధికారి సుబ్రమణ్యం నాయుడు,సూపర్ డెంట్ బాల రంగస్వామి, గుమస్తా మహేశ్వ ర్ బాబు, టెండర్ దారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వేలముల నందు దేవస్థానం ఏ ఈ ఓ లు రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, దేవదాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం నాయుడు, సూపర్డెంట్ బాల రంగస్వామి, గుమస్తా హేమేశ్వర్ బాబు, టెండర్ దారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** కార్తీక మాసం స్వాతి నక్షత్రం పెంచలకోనలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. అనంతరం స్వాతి నక్షత్రం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక హోమంలో పాల్గొన్నారు. స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలకమండ సభ్యులు సాధనమున్న రాయల్,బులేట్ జయశ్యామ్, శ్రీవారి సురేష్, మరియు ఉతరాజీ శరవణ కుమార్ వేలూరు రమేష్, ప్రసాద్, ఈశ్వర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి సిపిఐ(ఎం) జిల్లా ప్రథమ మహాసభలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** రేపటి నుండి (ఆది, సోమవారాలు) రెండు రోజులపాటు సత్యవేడులోని వివింకే కళ్యాణ మండపం ప్రాంగణంలో సిపిఐ (ఎం) 14వ మహాసభలు, అలాగే తిరుపతి జిల్లాలో జరిగే ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి, టి.సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యురాలు సాయి లక్ష్మి,జయచంద్ర,వేణుగోపాల్ తదితరులతో కలిసి మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభాధ్యక్షుడిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్ధన్ అధ్యక్ష తన జరిగే ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రధాన ఉపన్యాసకులుగా సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు,సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నూతన నాయకత్వ ఎన్నిక ఉంటుందన్నారు.కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున మహాసభల కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నాగరాజు కోరారు.



## హెల్త్ అసిస్టెంట్ బల్లి ప్రభాకర్ కన్నుమూత

**నాయుడుపేట టౌన్, మేజర్‌న్యూస్:** గొట్టిప్రోలు ప్రాథమిక వైద్యశాలలో హెల్త్ అసిస్టెంట్ గా పని చేస్తున్న బల్లి ప్రభాకర్(51) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. ప్రభాకర్ పార్థివ దేహాన్ని ఆయన స్వగ్రామమైన ఓజిలికి తరలించారు. స్నేహశీలి, మృధు స్వభావి అయిన ప్రభాకర్ కన్ను మూసిన సమాచారం తెలుసుకున్న సహ ఉద్యోగులు, మిత్రులు శ్రేయోభిలాషులు కన్నీటి పర్యంతమై ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. భగవంతుడు వారికి మనోదర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రభాకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## చుక్కల శంకరయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పెంకులపాడు హరిజనవాడ వైయస్సార్ సిపి నాయకుడు చుక్కల మహేష్ తండ్రి చుక్కల శంకరయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాధన మున్నా, బులేట్ జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంకు ఘన వీడ్కోలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నేతలు ఘన వీడ్కోలు పలికారు. తన తమ్ముడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మ క్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా హాజరై శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నాయకులతో చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు.



## బాల్ బాడ్మింటన్ విద్యార్థులకు బహుమతులు పంపిణీ

**బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులు మహిళ విభాగంలో బాల్ బాడ్మింటన్ పోటీలలో మంచి ప్రతిభను కనపరిచారు. ఈ పోటీలలో పాల్గొనుటువంటి క్రీడాకారులో ముసిలిపేడు గ్రామానికి చెందిన వి.రమ్య డిగ్రీ పూర్తి చేసిన శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల పూర్వ విద్యార్థి. ఈ క్రీడా పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనుపరాచిన రమ్య బాల్ బాడ్మింటన్ జాతీయ స్థాయి క్రీడా పోటిలకు ఏంపిక చేయడం జరిగింది. వచే నెల మహారాష్ట్రలో జరగబోయే 70వ సీనీర్స్ బాల్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్ జాతీయస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనబోతుంది. అదే విధంగా నంద్యాలలో జరిగిన సీనియర్స్ బాల్ బాడ్మింటన్ పోటీలలో మంచి ప్రతిభను చూపినందుకుగాను. హార్సిత ఎంబీఏ చదువుతున విద్యార్థిని 70వ సీనిర్స్ బాల్ బాడ్మింటన్ ఫెడరేషన్ ఛాంపియన్షిప్‌కు ఏంపిక చేయడం జరిగింది. బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా చైర్మన్ బొల్లినేని జగన్నాధం నాయుడు, ప్రెసిడెంట్. సి.వెంకటస్వామి జిల్లా కార్యదర్శి, ఏ బాలాజీ ఇరురికి అభినందనలు తెలుపుతూ సత్కరించారు. వెంకటస్వామి ప్రెసిడెంట్ మాట్లాడుతూ మహిళ క్రీడాకారునిలు అతుణ్యతస్థాయిలో ఉండాలి. వారు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలి. క్రీడలు వల్ల ఉద్యోగ అవకాశాలు మానసిక, శారీరక ధృఢత్వం కలిగి ఉంటారు అని క్రీడలు వల్ల ఉపయోగాలు క్రీడాకారునిలకు తెలిపారు.



## వరసిద్ధుని సేవలో ఏపిసిసిఎల్ఏ ప్రిన్సిపాల్ సెక్రటరీ

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ సీసీఎల్ఏ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముత్యాల రాజు కుటుంబ సమేతంగా, శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు, స్వామివారి సందర్శ నార్థం విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం రాజగోపురం వద్ద చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆలయ ఎఈఓ రవీంద్ర బాబు, వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ అశ్వరచన మండపంలో వేదపండితులచే అశ్వరచన చేసిన తరువాత ఆలయ ఎఈఓ రవీంద్ర బాబు చేతులు మీదగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు,శేష వస్త్రాలు,అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, ఐరాల ఎమ్మార్వో, కాణిపాకం ఎస్ఐ, ధరణిధర్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.





## సీఎంకు క్రీడాకారులు వినూత్న రీతిలో కృతజ్ఞత

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** రాష్టంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ పాలసీ ప్రకటించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు క్రీడాకారులు వినూత్నరీతిలో కృతజ్ఞతలు తెలిపారు.రామ్మూర్తి నాయుడు చర్మ క్రియలు ముగించుకుని తిరుగుపైనమైన ఆయనకు శుక్రవారం శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాసమంగాపురం వద్ద రోడ్డుకి ఇరువైపులానిలబడి క్రీడాకారులు ధన్యవాదాలు తెలియజేశారు. సుమారు 4వేల మంది క్రీడాకారులు రోడ్డు కిరువైపులా నిలబడి సీఎంకు స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు 4 లక్షలతో పాలసీలు ప్రకటించారు. ఇందులో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలకు రెండు నుంచి మూడు శాతం పెంచి రిజర్వేషన్ కల్పించారు. ఒలంపిక్స్ ఏషియన్‌గేమ్స్ విజేతలకు భారీ ప్రోత్సాహకాలు, ఒలింపిక్స్ బంగారు పతక విజేతకు రూ.75లక్షల నుంచి రూ.7కోట్లకు నగదు బహుమతి పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులను చూసి అభివాదం చేశారు. సీఎం వెంట శాప్‌చైర్మన్ అనిమినీ రవి నాయుడు ఉన్నారు.

## గురువుకి పూర్వ విద్యార్థులు శుభాకాంక్షలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, గోవిందరాజుస్వామి ఆర్ట్స్ కళాశాలలో మాజీ ప్రొఫెసర్ రఘునాథరెడ్డికి శుక్రవారం పూర్వవిద్యార్థులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దిన తమ గురుభక్తిని చాటుకున్నారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఆయనకు పూలమాలలు, శాలవులతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభా కాంక్షలు తెలిపారు. గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ కామర్స్ లెక్చరర్‌గా రఘునాథరెడ్డి విధులు నిర్వహించి వేల మంది విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరావు, టి సుబ్రహ్మణ్యం రెడ్డి, దుగ్గాని ప్రసాద్, సురేష్ స్వామి, నాగేశ్వరరావు, మల్లారపు రవిప్రసాద్, విక్రమ్ స్వామి, కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్వి ఆర్ట్స్ కాలేజ్ ముని మోహన్ సిద్ధారెడ్డి, రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ జయదేవ్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ అరవింద్ పాల్గొన్నారు.



## ఎంఎస్ఎంఈ సర్వేను పరిశీలించిన ఎంపీడీఓ

**శాంతిపురం మేజర్ న్యూస్:** శుక్రవారం చిన్నారిదొడ్డి గ్రామములో ఎంఎస్ఎంఈ సర్వే(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను) ఎంపీడీవో ప్రేమ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మండలములో 29.11.2024 వతేదీ నుండి ఎంఎస్ఎంఈ సర్వే సచివాలయ సిబ్బంది ద్వారా ప్రారంభించ బడినది. ఈ సర్వే ద్వారా యూనిట్ల వివరములు సేకరించి వాటికి ఆర్థిక సహాయం అందజేసి, మార్కెటింగ్ ఉత్పత్తి సామర్ధ్యాన్ని పెంచి, ఉత్పత్తి సామర్ధాన్ని పెంచుటకు ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుద్యోగ యువతీ యువకులను వ్యాపారం వైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని,కనుక అందరూ వ్యాపారస్తులు, చిల్లర దుకాణదారులు, పరిశ్రమ నిర్వాహకులు సర్వే సిబ్బందికి తగిన సమాచారం ఇచ్చి సర్వేకు సహకరించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమయ, సర్పంచ్ రేణుక బాలసుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# పెద్దశేష వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరించిన ఈఓ జె.శ్యామలరావు

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఉదయం జరిగిన పెద్దశేష వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. కావ్యప్రబంధాలలో ఆధ్యాత్మిక కథలు - విశ్లేషణ : ఎర్రా ప్రగడ రామకృష్ణకావ్యములు చెప్పదలచుకున్న ధర్మాన్ని చక్కగా సులభంగా అర్థమయ్యేలా చెబుతాయి. అటువంటి కావ్యాలలో ఆధ్యాత్మిక ధర్మ ప్రబోధాల్కెన కథలు అనేకం ఉన్నాయి. అటువంటి కథలను సేకరించి చక్కటి సులభమైన భాషతో నేటి తరానికి అర్థమయ్యేరీతిలో ఉదాహరణలతో 'కావ్యప్రబంధాలలో ఆధ్యాత్మిక కథలు-విశ్లేషణ" అనే శీర్షిక ద్వారా అందించారు. ఈ గ్రంథంలోని 15 శీర్షికల ద్వారా సామాజిక చ్కైతన్యాని, వ్యక్తి తన కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతను తెలుసుకొని ధర్మమార్గం వైపు పయనిస్తాడు. బేతాళ పంచవింశతి - ఆచార్య రేమిల్ల వేంకటరామకృష్ణ శాస్త్రి. ప్రాచీన భారతీయవ్మాయంలో కథాసాహిత్యానికి విశేషమైన స్థానమున్నది. సమాజానికి తెలియజేయవలసిన విషయాన్ని కథా కథనరీతిలో తెలియజేస్తే అది సమాజానికి త్వరగా చేరుతుంది. ఇట్టి కథాసాహిత్యాలు అనేకమున్నా వాటిలో బేతాళ పంచవింశతి విశేష ఆదరణను పొందింది. పంచవింశతి అంటే 25. తనను వశము చేసుకోవాలని



ప్రయత్నించిన విక్రమార్కమహారాజుతో బేతాళుడు అనే రాక్షసుడు 25 రాత్రులు చెప్పిన సమస్యాత్మక కథలే ఈ 'బేతాళ పంచవింశతి' ఈ కథలన్నీ ఉత్కంఠభరితంగా సాగుతూ చివరకు చిక్కుముడిగల ప్రశ్నలతో ముగుస్తాయి. ఆ ప్రశ్నలకు విక్రమార్కమహారాజు తన తెలివితేటలను నిరూపించుకొంటూ ధర్మబద్ధమైన, తర్కబద్ధమైన సమాధానాలను తెలియజేయడం ఇందులోని విశేషం.మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవనచరిత్ర - ఆచార్య టి.విశ్వనాథరావు తిరుమల శ్రీవేంకటేశ్వరాస్వామివారిని సేవించి తన సంకీర్తనలతో అర్చించి తరించిన మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. వివిధ ప్రక్రియలలో అష్టాదశ గ్రంథాలను రచించిన తరిగొండ వెంగమాంబ శ్రీనివాసుని తన భర్తగా భావించుకున్న పరమ సాధ్వీశిరోమణి. తన జీవితకాలంలో సమకాలీన సమాజం నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. వాటన్నిటిని శ్రీవేంకటేశ్వరునికే సమర్పించి సకల జీవులలోను సర్వాంతర్యామి అయిన ఆ శ్రీహరినే దర్శించింది. ఈమె పేరునే ప్రతిరోజు శ్రీనివాసుని ఏకాంతసేవలో ముత్యాలహారతి సమర్పించబడుతుంది. ఇంతటి మహనీయురాల్కెన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవిత చరిత్రను సమస్త భక్తజనావళికి తెలియజేసే ఉద్దేశంతో టీటీడీ తెలుగులో ఇదివరకే వెలువడిన ఈ గ్రంథాన్ని హిందీ, ఇంగ్లీషు భాషలలో అనువదింపజేసి ముద్రిస్తున్నది. ఉపదేశత్రయం -శ్రీ వావిలికొలను సుబ్బారావుఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయానికి విశేష సేవ చేసిన శ్రీ వావిలికొలను వారి రచనలను, టీటీడీ ముద్రించాలని నిర్ణయించింది. అందులో భాగమే ఈ "ఉపదేశత్రయము". ఈ ఉపదేశత్రయంలో మూడు భాగాలున్నాయి. 1. మేలుకొలుపు 2. హనుమదాచార్యోపదేశము 3. సీతోపదేశము. ఈ మూడు ఉపదేశాలు మానవుడు తన జీవితాన్ని సక్రమమార్గంలో నడిపించుకొనేందుకు ఉపకరిస్తాయి. సంపూర్ణ మానవ జీవితవికాసంకోసం చతురాశ్రమధర్మాలను వివరిస్తూ హనుమంతుడు ఆచార్యుడుగా రామాయణంలో తన పాత్రను నిర్వహించిన విధానాన్ని 'హనుమదాచార్యోపదేశము' వివరిస్తుంది. రామాయణంలోని సీత పాత్ర ద్వారా మనం తెలుసుకోదగ్గ ఉపదేశాన్ని 'సీతోపదేశం' వివరిస్తుంది. ధర్మచింతన పరాయణుల్కెన భక్తులు చదివి తమ జీవితాలను సక్రమ మార్గంలో మలచుకొనేందుకు ఈ ఉపదేశత్రయం గ్రంథం ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా. ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు డా. నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్ల వినతి

**పలమనేరు, మేజర్ న్యూస్:** తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని చిత్తూరు జిల్లా విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్స్ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి విన్నవించారు. పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం వారు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్లను మాతృ శాఖ ఆయన పట్టు పరిశ్రమ శాఖలో విలీనం చేయడంతో పాటు ప్రమోషన్లను కల్పించాలని కోరారు. ఇదివరకే వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని ప్రమోషన్ల విషయం ఏడాదిగా పెండింగ్ లో ఉందని తమతో పాటు పనిచేస్తున్న ఇతర శాఖ వారికి ఇప్పటికే పదోన్నతులు కల్పించారని కాబట్టి ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వంలో చర్చ జరుగుతోందని త్వరలో సమస్య కొలిక్కి రావచ్చని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా మీకు న్యాయం జరిగేలా చూస్తానని



ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఏడి కిషోర్ నాయక్, విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్ నవీన్ బాబు, రవీంద్ర నాథ్, హేమచంద్ర, రమణ రెడ్డి, హరిత, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ లాక్‌లతో దొంగతనాలకు చెక్

**రొంపిచెర్ల- మేజర్ న్యూస్ :** స్మార్ట్ లాక్‌లను వాడటం వలన దొంగతనాలకు చెక్ పెట్ట వచ్చని రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయాల ధర్మకర్త లకు స్మార్ట్ లాక్ లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 105 ఆలయాలు,12 మసీదులు, 2 చర్చిలు ఉన్నాయని అన్నారు. వాటిలో విలువైన విగ్రహాలు, హుండీలు ఉన్న ఆలయాలలో స్మార్ట్ లాక్ లను ఏర్పాటు చేయాలని అన్నారు. వాటిని ధర్మకర్తలకు ఇచ్చి ఆలయాలకు వేయడం జరుగుతుందన్నారు. స్మార్ట్ లాక్ లు , సీసీ కెమెరాలు వినియోగించడం వలన దొంగలు పడితే స్మార్ట్ లాక్ ల నుండి సైరన్ సౌండ్ వస్తుందని అప్పుడు దొంగతనాలను నివారించడానికి అవకాశం ఉందన్నారు. 25 ఆలయాలకు మొదటి విడుదల స్మార్ట్ లాక్ లను అందించడం జరిగిందని అన్నారు. కావున దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయ ధర్మకర్తలు ఆలయాలకు సీసీ కెమెరాలతో పాటు స్మార్ట్ లాక్ లను వేయాలని కోరారు. అలాగే ఇళ్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు, షాప్ లకు కూడా స్మార్ట్ లాక్ లు వినియోగించుకోవాలని సూచించారు.



# నియోజకవర్గం లో వైయస్సార్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మూడు వేల ఎకరాలు అసైన్మెంట్ భూములు కొట్టేశారు

## - అవినీతి వైసీపీ నేతలకు జైలు తప్పదు
## - నాలుగు రోజుల్లో కొంత మంది అరెస్టు
## ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనుచరులు మూడు వేల ఎకరాలు ప్రభుత్వ భూములు. నిరుపేదల భూములు. చెరువులు. గుంటలు. రోడ్డు పోరంబోకు భూములు గత ఐదేళ్ల పాలనలో వైసీపీకి చెందిన వారు కొట్టేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఈ అవినీతి అక్రమాలకు కారణమైన వైసీపీ నాయకులు. కార్యకర్తలకు జైలు జీవితం తప్పదని స్పష్టం చేశారు. మూడు నాలుగు రోజుల్లో కొంత మందిని అరెస్టు చేసే అవకాశముందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ, కొంత మంది రైతుల భూములను బలవంతంగా అక్రమించుకుని తమపై ఆన్ లైన్ లో నమోదు చేసుకున్నారనే విషయాలు విచారణలో వెలుగు చూశాయని తెలిపారు. ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో అక్రమాలకు పాల్పడిన, దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురిచేసిన ప్రతి ఒక్కరూ జైలుపోక తప్పదన్నారు. ఎమ్మెల్యేగా అధికార పార్టీలోనున్న తాను తలుచుకుంటే రెండు నిమిషాలు పట్టదు మమ్మల్ని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన వారిపై కక్ష తీర్చుకోవడమని అన్నారు. ఈ విషయంలో మా పార్టీ వారు కూడా నాపై అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఇదే విషయాన్ని మా అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళితే వాళ్లు చేసిన పని మనం చేస్తే అందులో అర్ధం ఏముంటుందని హితబోధ చేశారని చెప్పారు. నిజంగా ఆయన చెప్పిన విషయాలు ఆర్ధం చేసుకుని వారిపై కక్ష సాధింపు చర్యలను ఉపసంహకరించుకున్నానని తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా తెలిపి చట్టప్రకారం తప్పులు చేసిన వారు తప్పించుకోలేరనే విషయాన్ని వివరించినట్లు చెప్పారు. వైసీపీ నాయకత్వంలో ఎవరెవరు ఎక్కడెక్కడ తప్పులు చేశారో వారు జైలుకు వెళ్లబోతున్నారని తెలిపారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో అభివృద్ధిని మరచి అక్రమార్జనే ధ్యేయంగా వైసీపీ పాలన నడిచిందన్నారు. దాని ఫలితంగా శ్రీకాళహస్తిలో అభివృద్ధి ఇరవై ఏళ్లు వెనకకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దానిని సరిచేసుకుంటూ అభివృద్ధి బాట పట్టించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మరో నెల రోజుల్లో నియోజకవర్గం మొత్తం రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఒకే సారి కాకుండా కొద్దికొద్దిగా అభివృద్ధి పనులకు నిధులు తీసుకొస్తున్న విషయాన్ని వివరించారు. అభివృద్ధితో శ్రీకాళహస్తిని ఆదర్శవంతంగా నిలపడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

